
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విశాఖపట్నం

జిల్లా వార్తలు

సోమవారం 28 జూలై 2025

ప్రభుత్వ పరిశీలనలో దసపల్లా భూములు

- నేడు కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తా
- మంత్రి అనగాని సత్యప్రసాద్



మాట్లాడుతున్న రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్. పక్కన ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, టీడీపీ విశాఖ అధ్యక్షుడు గండి బాబ్జీ

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి):

నగరంలో విలువైన దసపల్లా భూముల వ్యవహారం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, ఇప్పటికే కేబినెట్‌లో చర్చ జరిగిందని రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్నారు. టీడీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో విలువైన ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై గతంలో టీడీపీ నేతలు పోరాటం చేశారన్నారు. దీనిలో భాగంగా దసపల్లా భూములతోపాటు మరికొన్ని భూములపై ప్రస్తుతం విచారణ జరుగుతోందని, నివేదిక వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. పలు కారణాలతో 22-ఏలో ఉన్న ప్రైవేటు భూములను తప్పిస్తున్నామని, దీనికి సంబంధించి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తానని ప్రకటించారు. ప్రజలు నేరుగా కలిసి వినతులు అందజేయాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు శరవేగంగా నిర్మాణంసాగుతుందని, విశాఖకు పలు ఐటీ కంపెనీలు వస్తున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ ఉత్తరాంధ్రపై తెలుగుదేశం పార్టీకి ఎనలేని అభిమానం ఉందన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవులను ఎర్రన్నాయుడు, కళా వెంకటరావు, చింతకాయల అయ్యన్నపాత్రుడు, ప్రస్తుతం పల్లా శ్రీనివాసరావుకు దక్కాయని, తాజాగా కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజును గోవా గవర్నర్‌గా నియమించారన్నారు..

రాష్ట్రంలో పాజిటివ్ గవర్నెన్స్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో పాజిటివ్ గవర్నెన్స్ నడుస్తున్నదని మంత్రి అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఏడాదిలోనే రూ.పది లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, యువతకు పెద్దఎత్తున ... మిగతా 6వ పేజీలో

స్టాండింగ్ కమిటీపై టీడీపీ కసరత్తు

భారీగా ఆశావహులు

- కార్పొరేటర్లతో సమావేశమైన మేయర్ పీలా శ్రీనివాసరావు
- కొలిక్కిరాకపోవడంతో ఎంపిక బాధ్యత ఎమ్మెల్యేలకే వదిలేయాలని నిర్ణయం



- రేపటితో ముగియనున్న నామినేషన్ దాఖలు గడువు
- పోటీలో అభ్యర్థులు ఎవరనేదానిపై ఇప్పటికీ రాని స్పష్టత
- అవకాశం కోసం ఎమ్మెల్యేలపై కార్పొరేటర్ల ఒత్తిడి

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికపై టీడీపీలో భారీ కసరత్తు జరుగుతోంది. స్టాండింగ్ కమిటీకి వచ్చేనెల ఆరున ఎన్నిక జరగనుండగా, మంగళవారంతో నామినేషన్ల దాఖలుకు గడువు ముగియనున్నది. వైసీపీ అభ్యర్థులు ఇప్పటికే నామినేషన్లు దాఖలు చేయగా, కూటమి నుంచి ఒక్కరు కూడా నామినేషన్ వేయలేదు. నామినేషన్ల దాఖలుకు ఒక్కరోజు మాత్రమే గడువున్నప్పటికీ అభ్యర్థులెవరనేదానిపై కూటమి పార్టీలు స్పష్టతకు రాలేకపోతున్నాయి. టీడీపీ నుంచి భారీగా ఆశావహులు ఉండడం, ఎవరూ వెనక్కి తగ్గేదిలేదని భీష్మించుకుని కూర్చోవడంతో అభ్యర్థుల ఎంపిక ఆపార్టీ నేతలకు పరీక్షగా మారింది.

జీవీఎంసీ ప్రస్తుత స్టాండింగ్ కమిటీ పదవీకాలం వచ్చేనెల ఆరుతో ముగుస్తుంది. ఆలోగా కొత్త స్టాండింగ్ కమిటీ ఎన్నిక తప్పనిసరిగా పూర్తికావాలి. ఈనేపథ్యంలో జీవీఎంసీ అధికారులు ఈనెల 21న నోటిఫికేషన్ జారీచేశారు. వచ్చేనెల ఆరున ఎన్నిక జరపాలని నిర్ణయించారు. నామినేషన్ల దాఖలుకు ఈనెల 29 మధ్యాహ్నం మూడు గంటల వరకు గడువు ఇచ్చారు. కాగా వైసీపీ నుంచి పది మంది కార్పొరేటర్లు ఈనెల 26న నామినేషన్లు దాఖలు చేశారు. అయితే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడడంతో మూడుపార్టీలు కలిసి స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీచేయనున్నాయి. స్టాండింగ్ కమిటీలో పది మంది సభ్యులను ఎన్నుకోవాల్సి ఉండడంతో బీజేపీకి ఒకటి, జనసేనకు రెండు స్థానాలను కేటాయించక తప్పని పరిస్థితి నెలకొంది. మిగిలిన ఏడు సీట్లను టీడీపీ తమ కార్పొరేటర్లకు కేటాయించాల్సి ఉంటుంది.

జీవీఎంసీలో బలాబలాలు

జీవీఎంసీలో టీడీపీకి 44 మంది కార్పొరేటర్లు, జనసేనకు 14 మంది, బీజేపీకి ఇద్దరు కార్పొరేటర్లున్నారు. వీరుకాకుండా అనకాపల్లి జోన్‌కు చెందిన ఇద్దరు కార్పొరేటర్లు, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కుమార్తె ఆరోవార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక గతంలో జరిగిన మేయర్, డిప్యూటీ మేయర్ అవిశ్వాస తీర్మానం, కొత్త మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక సమయాల్లో టీడీపీకి మద్దతుగా నిలిచారు. దీంతో వారిని కూడా కలుపుకుంటే మొత్తంగా కూటమికి 63 మంది కార్పొరేటర్ల బలం ఉంది. వైసీపీకి 34 మంది కార్పొరేటర్లున్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలో గెలుపొందాలంటే వైసీపీకి పడే ఓట్ల కంటే కనీసం ఒక్కటైనా ఎక్కువ రావాలి. అంటే వైసీపీ కార్పొరేటర్లు అందరూ ఆపార్టీ అభ్యర్థులకే ఓటు వేస్తే, ఒక్కొక్కరికి 35 లేదా అంతకంటే ఎక్కువ ఓట్లు అవసరం. కూటమికి అంతకంటే 30 ఓట్లు ఎక్కువగా వస్తాయి కాబట్టి కూటమి నుంచి పోటీకి దిగిన అభ్యర్థుల గెలుపు లాంఛనమే. దీంతో టీడీపీలో ఆశావహుల సంఖ్య భారీగా ఉంది.

ఏడు నెలలే గడువు...

మరో ఏడునెలల్లో పాలకవర్గం పదవీకాలం పూర్తయిపోతుంది కాబట్టి, అందరూ స్టాండింగ్ కమిటీలో ఈసారి ఎలాగైనా స్థానం సంపాదించాలని ఆరాటపడుతున్నారు. తమకు అవకాశం ఇవ్వాలంటూ మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతులు అందజేశారు. స్టాండింగ్ కమిటీలో పది స్థానాలకు మూడు జనసేన, బీజేపీకి పోతే మిగిలిన ఏడు స్థానాలకు 30 మందికిపైగా పోటీపడుతుండడంతో వారిని వడపోయడం ఎలా అని మేయర్ తలపట్టుకున్నారు. టీడీపీ కార్పొరేటర్లతో శనివారం తన చాంబర్‌లో సమావేశం ఏర్పాటుచేసి స్టాండింగ్ కమిటీ ఎన్నికపై చర్చించారు. ఈ సందర్భంగా ఆశావహులంతా ఎలాగైనా తమకు అవకాశం ఇవ్వాల్సిందేనని పట్టుబట్టడంతో పోటీచేసే వారిని తేల్చే బాధ్యతను తాను తీసుకోవడం లేదని, ... మిగతా 6వ పేజీలో

సంపాదన సాఫల్య కేంద్రాలు!

దగా చేస్తున్న కొన్ని కేంద్రాల నిర్వాహకులు

అడ్డగోలు వ్యవహారాలకు నిలయంగా మారుతున్న ఫెర్టిలిటీ సెంటర్లు



- సృష్టి వ్యవహారం వెలుగులోకి రావడంతో చర్చ
- గతంలోనూ పలు కేంద్రాలపై ఆరోపణలు
- ఆరోగ్యశాఖ పర్యవేక్షణ లేకపోవడమే కారణం
- జిల్లాలో 50 ఫెర్టిలిటీ సెంటర్లు
- తొమ్మిది కేంద్రాలకు సరోగసీ చేసే అవకాశం

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి):

సంతాన సాఫల్య కేంద్రాలు అడ్డగోలు వ్యవహారాలకు కేంద్రాలుగా మారి సంపాదన సాఫల్య కేంద్రాలుగా మారు తున్నాయి. కొన్నాళ్లుగా జిల్లాలో ఫెర్టిలిటీ సెంటర్లు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయాయి. ఉత్తరాంధ్రతోపాటు అనేక జిల్లాలకు చెందిన వారు ఈ కేంద్రాలకు వచ్చి వైద్య సేవల ను పొందుతున్నారు. ఈ నేపథ్యంలో పిల్లలు లేని దంపతులను లక్ష్యంగా చేసుకుని అనేకసెంటర్లు అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకుల వ్యవహారం వెలుగులోకి వచ్చిన తరువాత మిగిలిన కేంద్రా ల్లో వ్యవహారాలపైనా అనుమానాలు తలెత్తుతున్నాయి.

హైదరాబాద్‌లోని సృష్టి సంతాన సాఫల్య కేంద్రం నిర్వాహకులు పిల్లలు లేని జంటకు మరొకరి స్పెర్మ్ ద్వారా పిల్లలు పుట్టించారు. ఆ బిడ్డకు అనారోగ్య సమస్యలు రావడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఆ జంట పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. హైదరా బాద్‌లోని కేంద్రంలో పోలీసులు తనిఖీలు చేయగా, అప్పటికే భారీగా నిల్వచేసిన స్పెర్మ్ లభించినట్టు తెలిసిం ది. ఈ క్రమంలోనే విశాఖ, విజయవాడలోనూ తనిఖీలు చేపట్టారు. నగరంలోని జిల్లా పరిషత్ జంక్షన్ సమీపంలో సృష్టి సంతాన సాఫల్య కేంద్రం ఉంది ఈ సెంటర్ ఏర్పాటుకు 2018లో అనుమతి తీసుకున్న నిర్వాహకులు 2023 నుంచి రెన్యువల్ చేసుకోలేదు. ఇక్కడ కొన్నాళ్లపాటు కార్యకలాపాలు కూడా నిర్వహించలేదు. అయితే, సృష్టి పేరుతో ఇక్కడ రహస్యంగా వ్యవహారాలు సాగిస్తున్నట్టు పోలీసు తనిఖీల్లో తేలింది. హైదరాబాద్‌లో ఫిర్యాదు చేసిన మహిళను ప్రసవం నిమిత్తం ఇక్కడ కొన్నాళ్లపాటు ఉంచి, ఆ తరువాత అక్కడికి తరలించినట్టు తెలుస్తోంది. తాజా దాడుల్లో స్పెర్మ్ నిల్వలతోపాటు పలువురు మహిళల రిపోర్టులు, ఇప్పటికే చికిత్స అందిస్తూ గర్భం దాల్చిన వారి వివరాలతో కూడిన ఫైల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

గుట్టుగా వ్యవహారాలు..

సంతాన సాఫల్య కేంద్రాల పేరుతో పెద్దఎత్తున వ్యాపారం సాగుతోంది. ఇందుకోసం ఒక్కో కేంద్రం నిర్వాహకులు ఏజెంట్లను నియమించుకుంటున్నారు. సంతానం లేని ... మిగతా 6వ పేజీలో

రంగు మారిన సంద్రం



తెన్నేటి పార్కు వద్ద సముద్రం నీరు రంగు మారిన దృశ్యం

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి):

తీరంలో సముద్రం రంగు మారింది. జోడుగుళ్లపాలెం నుంచి పెదజాలారిపేట వరకు ఎర్రగా మారడంతో సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. బంగాళాఖాతంలో రుతుపవన కరెంట్ బలంగా ఉండడంతో అలలు ఎగసిపడుతున్నాయి. ఈ సమయంలో తీరంలో ఒంద్రు కోతకు గురై సముద్రంలోని ఎర్ర రంగు నాచు (రెడ్ ఆల్గే) తీరం దిశగా రావడంతో సముద్రం ఇలా రంగు మారుతుందని సముద్ర అధ్యయన నిపుణుడు డాక్టర్ కేవీకే రామకృష్ణ పట్నాయక్ వివరించారు. కాగా నగరం నుంచి మురుగునీరు సంద్రంలో కలిసిన తరువాత మురుగు తీరానికి చేరడంతో ఆర్కేబీచ్ పరిసరాల్లో ఇసుక నల్లగా మారింది.

సందడిగా కావడి యాత్ర



కుటుంబ బంధాలు బాగుండాలని, పంటలు బాగా పండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకుంటూ ఏటా శ్రావణ మాసంలో మార్వాడీలు చేపట్టే కావడియాత్ర ఆదివారం వైభవంగా జరిగింది. మాధవదార వద్ద ప్రారంభమైన యాత్ర బీచ్ రోడ్డులోని పాండురంగస్వామి ఆలయానికి చేరుకుంది. యాత్రలో మహిళలు, చిన్నారులు, యువత పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కావడితో తీసుకువచ్చిన జలాలతో ఆలయం లోని శివ లింగానికి అభిషేకాలు, పూజలు, చేశారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

గ్రేటర్‌లో చికెన్ వ్యర్థాల లొల్లి

తరలింపు కోసం కాంట్రాక్టర్లు, ప్రైవేటు వ్యక్తుల మధ్య పోటీ

ఇరువర్గాలకు కూటమినేతల అండదండలు

- ఒకరి వాహనాలను ఒకరు పట్టుకుని సోషల్‌మీడియాలో పోస్టింగ్‌లు
- చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనమేషాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగర పాలక సంస (జీవీఎంసీ)లో చికెన్‌వ్యర్థాల సేకరణ వివాదం రోజురోజుకి ముదురుతోంది. చికెన్ వ్యర్థాలకు చేపల పెంపకందార్ల నుంచి భారీ డిమాండ్ ఉండడంతో వ్యర్థాల సేకరణకు జీవీఎంసీ నుంచి టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లతోపాటు కొందరు ప్రైవేటు వ్యక్తులు పోటీపడుతున్నారు. ఇరువర్గాలకు కూటమి నేతల అండదండలు ఉండడంతో ఒకరి వాహనాలను ఒకరు పట్టుకుని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. డంపింగ్‌యార్డుకి కాకుండా చేపలచెరువులకు వ్యర్థాలను తరలించే వారిపై కఠినచర్యలు తీసుకోవాల్సిన అధికారులు మీనేమేషాలు లెక్కిస్తున్నారు. ఇది జీవీఎంసీ కార్పొరేటర్లు, అధికారుల్లో నిత్యం వివాదాలకు కారణంగా మారుతోంది.

జీవీఎంసీ పరిధిలో చికెన్ దుకాణాల నుంచి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను గెడ్డలు, రోడ్లపై పడేస్తుండడం వల్ల పారిశుధ్యలోపంతో పాటు ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోంది. దీనిని గుర్తించిన జీవీఎంసీ అధికారులు నగరంలోని చికెన్ దుకాణాల నుంచి వ్యర్థాలను వాహనంలో సేకరించి, కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకి తరలించేందుకు రెండేళ్లకొకసారి



చికెన్‌వ్యర్థాల లోడుతో అనకాపల్లి వద్ద పట్టుబడిన వ్యాన్

టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగిస్తోంది. చికెన్ వ్యర్థాలను చేపల చెరువుల్లో వేయడం వల్ల చేపలు తక్కువకాలంలోనే ఎక్కువ బరువు పెరుగుతున్నట్టు చేపలపెంపకందారులు గుర్తించారు. దీంతో అనకాపల్లి, దేవరాపల్లితోపాటు ఉభయగోదావరి జిల్లాల్లోని చేపల చెరువులు యజమానులు నగరంలో చికెన్ వ్యర్థాలను సేకరించేవారిని సంప్రదించారు. వ్యర్థాలను సరఫరా చేస్తే భారీగా డబ్బు ఇవ్వడానికి అంగీకరించడంతో కాంట్రాక్టర్లు వ్యర్థాలను డంపింగ్‌యార్డుకి కాకుండా చేపల చెరువులకు విక్రయించడం మొదలుపెట్టారు. కొన్నాళ్లు ఈ వ్యవహారం గుట్టుగానే జరిగినప్పటికీ చికెన్‌వ్యర్థాలకున్న డిమాండ్ బయటకు తెలిసింది. దీంతో సేకరణకు పోటీపెరిగింది. కాపులుప్పాడలోని డంపింగ్‌యార్డుకు తరలిస్తామని జీవీఎంసీతో అంగీకారం కుదుర్చుకున్నా చేపల చెరువులకే తరలించడంతో టెండర్లకు కొన్నేళ్లుగా పోటీపెరిగింది. వైసీపీ హయాంలో ఆపార్టీనేతలు తమ అనుచరులకు కోడి వ్యర్థాల టెండర్లు అప్పగించి భారీగా ముడుపులు దండుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారదర్శకంగా టెండర్లు పిలిచి ఒక్కో జోన్‌కు ఒకరుచొప్పున ఎనిమిది జోన్లకు ఎనిమిది మంది కాంట్రాక్టర్లకు టెండరు అప్పగించారు. వీరిలో కొందరు చికెన్‌వ్యర్థాలను గతంలో మాదిరిగానే చేపల చెరువులకు విక్రయిస్తుండడంతో పెద్దఎత్తున దుమారం రేగింది. దీనిపై అధికారులు స్పందించి టెండర్లను రద్దుచేశారు. కాంట్రాక్టర్లు కోర్టుకి వెళ్లడంతో అధికారుల ఆదేశాలపై స్టే విధించింది. ఇదే అదనుగా గతంలో కోడివ్యర్థాల సేకరణలో అనుభవం కలిగిన వైసీపీకి చెందిన కొందరు నేతలు రౌడీషీటర్లను నియమించుకుని కాంట్రాక్టర్లకు పోటీగా చికెన్‌దుకాణాల నుంచి వ్యర్థాలను సేకరించడం ప్రారంభించారు. వీరికి కూటమిలోని కొందరు నేతలు అండగా నిలవడంతో కాంట్రాక్టర్లు, ప్రైవేటువ్యక్తులు రెండువర్గాలు విడిపోయారు. ఒకరి వాహనాలను ఒకరు పట్టుకుని జీవీఎంసీ గ్రూపులోనూ, కార్పొరేటర్లు, అధికారులు కలిసి ఉండే టీమ్ జీవీఎంసీ గ్రూపులోనూ పోస్టుచేస్తున్నారు. కొద్దిరోజుల కిందట అనకాపల్లి వద్ద రెండు వాహనాలు, సబ్బవరం వద్ద ఒకటి, గాజువాక, గోపాలపట్నంలో రెండేసి వాహనాలను పట్టుకుని అధికారులకు అప్పగించడంతో వారు పోలీస్‌స్టేషన్‌లో ... మిగతా 6వ పేజీలో

అతిథి అధ్యాపకుల ఇంటర్వ్యూలపై సస్పెన్స్!

- దరఖాస్తు చేసుకున్న వారికి కాల్ లెటర్స్ పంపిణీ
- ప్రిన్సిపాళ్లు, హెచ్‌వోడీలకు అందని సమాచారం



విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అతిథి అధ్యాపకుల ఇంటర్వ్యూలపై సస్పెన్స్ కొనసాగుతోంది. వచ్చే నెల ఒకటి నుంచి నాలుగో తేదీ వరకు ఇంటర్వ్యూలకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు కాల్ లెటర్స్ పంపించారు. గతంలో ఆరుగురి సభ్యులతో కూడిన కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో కాలేజీ ప్రిన్సిపాల్, విభాగాధిపతి, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్, సబ్జెక్ట్ నిపుణుడు, ఇద్దరు ఈసీ మెంబర్స్ ఉండేవారు. ఇప్పుడూ అదే విధానాన్ని అనుసరిస్తారా.? అనేదానిపై సందిగ్ధత నెలకొంది. ఇప్పటి వరకు కాలేజీ ప్రిన్సిపాల్స్, హెచ్‌వోడీలకు ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందలేదు. దీంతో ఇంటర్వ్యూల నిర్వహణ తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో మాదిరిగా నిర్వహించే ఉద్దేశం ఉంటే ఉన్నతాధికారులు బోర్డు సభ్యులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నిస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో కమిటీ సభ్యులకు సమాచారం ఇస్తారని పలువురు పేర్కొంటున్నారు.

సీనరేజ్ కాంట్రాక్ట్ కోసం పట్టు

- ఉమ్మడి జిల్లాలో రూ.16 కోట్లకు టెండరు ఆహ్వానించిన గనులశాఖ
- రంగంలోకి దిగిన ఇద్దరు కూటమి ప్రజాప్రతినిధులు
- తమ వారికే బిడ్ ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి



అనకాపల్లి మండలం కుంచంగి సర్వే నంబరు 316లో రాయి క్వారీ (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి విశాఖ జిల్లాలో గనుల సీనరేజ్ వసూళ్ల కాంట్రాక్టు కోసం భారీగా పోటీ నెలకొంది. ఉమ్మడి జిల్లాలో ప్రతి నెలా గనుల లీజులు, తాత్కాలిక పర్మిట్లు, ఇతరత్రా జరిమానాల రూపంలో రూ.11 కోట్లు వసూలవుతుంది. దీనిని పరిగణనలోనికి తీసుకుని సీనరేజ్ వసూళ్ల కోసం నెలకు రూ.16 కోట్లకు టెండరు ఆహ్వానించింది. దీంతో ఉత్తరాంధ్రలోని రెండు జిల్లాలతోపాటు ఉభయగోదావరి జిల్లాల్లో సీనరేజ్ వసూలు చేస్తున్న సంస్థలతో పాటు మరో సంస్థ బిడ్లు వేసింది. ప్రభుత్వం ఇంకా వాటిని ఓపెన్ చేయలేదు. అయితే కూటమి ప్రభుత్వంలో కొందరు ప్రజాప్రతినిధులు తమ వారికే కాంట్రాక్టు దక్కేలా చక్రం తిప్పుతున్నారు. ఈ నేపథ్యంలో కోస్తా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు ప్రజాప్రతినిధులు రంగంలోకి దిగి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారనే ప్రచారం సాగుతోంది.

జిల్లాలో ప్రభుత్వం అనుమతించిన క్వారీల్లో తవ్వకాలకు భిన్నంగా పలు రకాల గనులు తవ్వి తరలిస్తున్నారనే సమాచారంతో గత ప్రభుత్వం సీనరేజ్ వసూళ్ల బాధ్యతను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టింది. గనుల శాఖలో పరిమితంగా ఉన్న సిబ్బందితో సీనరేజ్ వసూళ్లతోపాటు అక్రమ క్వారీయింగ్‌ను అరికట్టలేమని ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో గత ప్రభుత్వం అమలుచేసిన కాంట్రాక్టు విధానాన్ని కొనసాగించాలని ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించింది. వైసీపీ హయాంలో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల కాంట్రాక్టులను రెండు సంస్థలకు అప్పగించింది. ఉమ్మడి విశాఖ జిల్లా టెండరును అప్పటి వైసీపీ నేతలు అడ్డుకోవడంతో విరమించుకుంది. అయితే ప్రస్తుత ప్రభుత్వం, గతంలో కాంట్రాక్టు ఇవ్వని జిల్లాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలని నిర్ణయం తీసుకుంది.

అనకాపల్లి జిల్లా కీలకం..

ప్రస్తుత అనకాపల్లి జిల్లాలో మెటల్, గ్రానైట్‌తోపాటు ... మిగతా 6వ పేజీలో

అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, జూలై 27 (ఆంధ్రజ్యోతి):వరాహలక్ష్మీనృసింహస్వామికి అర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు.ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ చేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శత నామావళి పఠిస్తూ ప్రతి నామానికి స్వర్ణ పుష్పాలతో అర్చించారు. తరువాత అవే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

కొట్లాటలో ముగ్గురిపై కేసు నమోదు

భీమునిపట్నం (రూరల్), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటితూరు మద్యం దుకాణం వద్ద శనివారం సాయంత్రం జరిగిన కొట్లాటలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు భీమిలి పోలీసులు తెలిపారు. మహిళను దుర్భాషలాడడంతో ఇద్దరు వ్యక్తుల మధ్య ఈ గొడవ జరిగింది. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశామని పోలీసులు చెప్పారు.

రికార్డులు లేని వాహనాలు సీజ్



కృష్ణాపురం కాలనీలో పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకులు

పద్మనాభం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ఎటువంటి పత్రాలు లేకుండా నడుపుతున్న ఎనిమిది బైకులు, రెండు ఆటోలను సీజ్ చేసినట్టు పద్మనాభం పోలీసులు చెప్పారు. కృష్ణాపురం, కుర్రపల్లి జగనన్న కాలనీల్లో సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈమేరకు రికార్డులు లేని 8 బైక్‌లు, 2 ఆటోలను సీజ్ చేశారు. అలాగే కృష్ణాపురం కాలనీలో బెల్టుషాపు నిర్వహిస్తున్న ఒక మహిళను అదుపులోకి తీసుకుని ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

కోడి పందేలు ఆడుతున్న ఐదుగురి అరెస్టు

ఆనందపురం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొట్టిపల్లి పంచాయతీ చీమలవెంకటాపురంలో కోడిపందేలు ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్టు సీఐ చింతా వాసునాయడు తెలిపారు. చీమలవెంకటాపురంలో కోడి పందేలు ఆడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ సంతోష్, సిబ్బంది ఆదివారం దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని రెండు కోళ్లు, 18,320 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు.

యువకుడ్ని రక్షించిన లైఫ్‌గార్డులు



యువకుడితో లైఫ్‌గార్డులు, మెరైన్ పోలీసులు

సాగర్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌లో సముద్ర స్నానానికి దిగి ప్రమాదానికి గురైన యువకుడ్ని లైఫ్‌గార్డులు రక్షించారు. కంచరపాలెం ప్రాంతానికి చెందిన కె. రోహిత్ (20) స్నేహితులతో కలిసి ఆదివారం విహారానికి వచ్చాడు. సముద్ర స్నానం చేస్తుండగా పెద్ద కెరటం అతన్ని తాకడంతో ప్రమాదానికి గురయ్యాడు. కెరటాల్లో కొట్టుకుపోతున్న యువకుడ్ని సమీపంలో విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డులు గమనించి రక్షించారు.

నవోదయ దరఖాస్తుల గడువు పెంచాలి

మధురవాడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే గడువు పెంచాలని చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం కోరారు. ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఈ విషయమై కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖతో పాటు నవోదయ విద్యాలయం సంస్థ ప్రధాన కార్యాలయానికి లేఖలు రాసినట్టు తెలిపారు. ఈనెల 29 వరకు గడువు విధించడం వల్ల జిల్లాలో ఇంతవరకు కేవలం 2355 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు.

ఎన్ఎంఎంఎస్ విద్యార్థులకు అల్పాహారం

తగరపువలస, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు దాతలు ఆదివారం అల్పాహారం అందించారు. సుమారు 120 మంది విద్యార్థులకు సత్యసాయి సేవా సమితి సభ్యులు అల్పాహారం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.సత్యనారాయణ, చిన్నారావు, శివకుమార్, మోహనరావు, అప్పారావు పాల్గొన్నారు.

డ్రైనేజీపై పలకలు లేక అవస్థలు



పలకలు లేకుండా ఉన్న డ్రైనేజీ

సింహాచలం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు పాతగోశాల కూడలి వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా చేపట్టిన డ్రైనేజీపై పలకలు ఏర్పాటు చేయకుండా వదిలేశారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో అనేక మంది వాకర్స్ ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. కాలువలో పడే ప్రమాదం ఉంది. అధికారులు తక్షణమే కాలువపై పలకలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

రామానాయుడు స్టూడియోలో సినిమా షూటింగ్



పోలీస్‌స్టేషన్‌లో హీరో, హీరోయిన్‌పై సన్నివేశం చిత్రీకరణ

సాగర్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : తిమ్మాపురం రామానాయుడు సినీ స్టూడియోలో ఆదివారం సినిమా షూటింగ్ జరిగింది. సూపర్ హిల్ ఫిలిమ్స్ బ్యానర్‌పై కల్కి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈమేరకు స్టూడియోలో ఉన్న పోలీస్ స్టేషన్ సెట్‌లో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. హీరో శంకర్, హీరోయిన్ ప్రవల్లికపై పలు సన్నివేశాలను తీశారు. చిత్రం పేరును త్వరలో ప్రకటించనున్నట్టు దర్శకుడు తెలిపారు.

సందర్శకులకు దారేది ?

- రుషికొండ బీచ్‌లో వ్యాపారుల ఇష్టారాజ్యం
- దారి మూసివేసి అమ్మకాలు
- మంత్రి ఆదేశాలు బేఖాతరు
- పట్టించుకోని అధికారులు
- రాకపోకలకు పర్యాటకుల ఇబ్బందులు



బీచ్‌లో సందర్శకులు వెళ్లడానికి వీల్లేకుండా వేసిన బెంచీలు, కుర్చీలు

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌లో వ్యాపారులు ఇష్టారాజ్యంగా అమ్మకాలు సాగిస్తున్నారు. సందర్శకులు రాకపోకలు చేయడానికి కనీసం దారి కూడా లేకుండా బెంచీలు, కుర్చీలు వేస్తున్నారు. దీనివల్ల పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. బీచ్‌లో వ్యాపారాలు చేసుకోవడానికి రాష్ట్ర పర్యాటక శాఖ ఉచితంగా దుకాణాలు ఇచ్చింది. కొందరు వ్యాపారులు దుకాణాలు ఉన్న విస్తీర్ణం కంటే సుమారు పది అడుగులు ముందుకు వచ్చి వ్యాపారాలు చేస్తుండడంతో సందర్శకులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. దీనివల్ల బీచ్ బ్యూటిఫికేషన్ దెబ్బతింటోందని, ఎలా పడితే అలా వ్యాపారాలు చేస్తుండడం వల్ల మళ్లీ బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్‌కు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని పర్యాటక శాధికారులు తర్జనభర్జన పడుతున్నారు. వ్యాపారులకు రాజకీయ నాయకుల వద్ద పలుకుబడి ఉండడంతో అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ పునఃరుద్ధరణ సమయంలో బీచ్ పర్యాటనకు వచ్చిన మంత్రి కందుల దుర్గేష్ రోడ్డును ఆక్రమించి షాపులు ఏర్పాటు చేయడంతో వ్యాపారులపై మండిపడ్డారు. తక్షణమే ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. కానీ అధికారులు మంత్రి ఆదేశాలను అమలు చేయలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. కాగా వ్యాపారుల తీరు వల్ల బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ పునరుద్ధరణ సమయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని పర్యాటక శాఖలోని అధికారులు తెలిపారు.

ఇనాం భూముల సమస్య త్వరలో పరిష్కారం

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- బోని గ్రామంలో 'తొలి అడుగు'



బోనిలో కరపత్రాలు పంచుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఆనందపురం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ఏడు గ్రామాల్లో నెలకొన్న ఇనాం భూముల సమస్యకు త్వరలో పరిష్కారం చూపిస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ఆదివారం బోని గ్రామంలో జరిగిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనేక ఏళ్లుగా సాగు చేస్తున్న రైతులు ఆ భూములను అమ్ముకునే వీల్లేక, తాకట్టు పెట్టుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. టైటిల్ డీడ్ ఉన్న మాన్సాస్ కూడా బోని, తదితర గ్రామాల్లోని భూములను స్వాధీనం చేసుకోలేని పరిస్థితి ఉందని తెలిపారు. రైతులకు, మాన్సాస్‌కు ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపించాల్సిన అవసరం ఉందని, సమస్యను ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రెవెన్యూ మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లానని చెప్పారు. అనంతరం మాజీ సర్పంచ్ సత్యప్రసాద్‌ను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, నాయకులు బీఆర్‌బీ నాయడు, గంగ్రెడ్డి స్వామినాయుడు, పాండ్రంకి అప్పలరాజు, సురాల సత్యవరప్రసాదరావు, శ్రీకాంత్ రాజు, కోరాడ వైకుంఠరావు, కాళ్ల నగేశ్, అప్పలనారాయణ పాల్గొన్నారు.

వసంత విహార్‌లో..

కొమ్మాది : ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం శ్రమిస్తున్నారని ఆరో వార్డు టీడీపీ నాయకులు అన్నారు. ఆదివారం వారు కొమ్మాది దరి వసంత విహార్ వద్ద సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దాసరి శ్రీనివాస్, గరే గురునాథ్, మన్యాలసోంబాబు, గొల్లంగి ఆనందబాబు, పోలిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు తునివలసలో...

పద్మనాభం/పద్మనాభం రూరల్ : మండలంలోని తునివలస గ్రామంలో సోమవారం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం జరగనున్నట్టు ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు.ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్టు చెప్పారు. కాగా మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటివరకు అమలు చేసిన పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, మాజీ సర్పంచ్ ఈగల శ్రీరామ్మూర్తి, నాయకులు కృష్ణప్పడు, చంద్రరావు, రొబ్బి సూర్యనారాయణ పాల్గొన్నారు.

దుర్గాప్రసాద్‌కు జనకవి బిరుదు

తగరపువలస, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కొండపేటకు చెందిన ఐనాడ దుర్గాప్రసాద్‌కు మాతా కళా పీఠం జనకవి బిరుదును ప్రదానం చేశారు. ఆదివారం విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ నిర్వాహకులు దుర్గా ప్రసాద్‌కు జనకవి బిరుదును, భీమిలికి చెందిన రామకృష్ణానందకు ప్రవచన వాచస్పతి బిరుదును ప్రదానం చేశారు. రామనారాయణం పేరుతో అనేక పాటలు రాసినందుకు జనకవి బిరుదు ఇచ్చినట్టు దుర్గాప్రసాద్ చెప్పారు.

శాస్త్రీయ నృత్య ప్రదర్శన

మధురవాడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా మధురవాడ శిల్పారామంలో నగరానికి చెందిన సిద్దేంద్ర యోగి నాట్యాలయం చిన్నారులు ఆదివారం పలు శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించారు. పలు భక్తి గీతాలు, కోలాటం ప్రదర్శించారు.

పుస్తకాలు వితరణ

భీమునిపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది కోట మల్లికార్జునరావు, లయన్స్ క్లబ్ భీమిలి సెంటినియల్ సంయుక్తంగా పీఎస్ఎం హైస్కూల్ గ్రంథాలయానికి రూ.10 వేలు విలువైన పోటీ పరీక్షల పుస్తకాలను వితరణగా అందజేశారు. ఆదివారం స్థానికంగా జరిగిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులకు దాతలు పుస్తకాలు ఇచ్చారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పద్మనాభం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ప్రబోధానంద సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. వెంకటాపురం,రేవిడి పంచాయతీల పరిధిలో అన్నంపేట, అల్లువారి కళ్లాలు, ముల్లువారి కళ్లాలు గ్రామాల్లో త్రైత ప్రచారం జరిపారు.

స్టాండింగ్ కమిటీపై టీడీపీ కసరత్తు

... 5వ పేజీ తరువాయి

నగరంలోని ఎమ్మెల్యేలకే వదిలిపెడుతున్నామని ప్రకటించేశారు. వారిచ్చే జాబితా ఆధారంగానే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తారని స్పష్టంచేశారు. దీంతో ఆశావహులంతా ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి అవకాశం ఇప్పించాలని ఒత్తిడిచేయడం ప్రారంభించారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల వరకే నామినేషన్ల దాఖలుకు అవకాశం ఉండడంతో ఆలోగా ఎమ్మెల్యేలు అభ్యర్థులను ఖరారుచేయాల్సి ఉంటుంది. జీవీఎంసీ పరిధిలో ఎనిమిది నియోజకవర్గాలు ఉండగా, ఒక్కో నియోజకవర్గం నుంచి ఒక్కోఅభ్యర్థిని ఎంపిక చేసినా ఒకరు ఎక్కువ అవుతారు కాబట్టి, పోటీకి దిగే అభ్యర్థుల ఎంపికపై కార్పొరేటర్లతోపాటు నేతల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.



అబ్దుల్ కలామ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

యువతకు ఆదర్శం అబ్దుల్ కలామ్

భీమునిపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : క్షిపణి శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ జీవితం యువతకు ఆదర్శనీయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. కలామ్ వర్ధంతి పురస్కరించుకుని ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వున్న కలామ్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రపతిగా, క్షిపణి శాస్త్రవేత్తగా కలామ్ దేశానికి విశిష్టమైన సేవలు అందించారని కొనియాడారు. 3వ డివిజన్ టీడీపీ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మారోజు సంజీవకుమార్, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్టూడెంట్స్ యూనైటెడ్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి కన్వీనరు మైలపల్లి షణ్ముఖరావు, ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి తదితరులు కూడా కలామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

దివాన్‌జీ కాలువ నీరు విడుదల



కాలువ ద్వారా ప్రవహిస్తున్న నీరు

పద్మనాభం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాండ్రంగి దివాన్‌జీ కాలువ ద్వారా సాగునీరు విడుదల కావడంతో రైతులు ఖరీఫ్ పనులకు సన్నద్ధం అవుతున్నారు. మద్దిలోని గోస్తనీ నది ఆనకట్ట నుంచి తాటితూరు పెద్దచెరువు వరకు విస్తరించి ఉన్న ఈ కాలువలో ఇటీవల పూడిక తొలగించారు. దీంతో నీటి పారుదలకు మార్గం ఏర్పడింది. ఈ కాలువ ద్వారా ప్రవహించే నీటితో 1158 ఎకరాలు సాగు చేయనున్నారు.

భీమిలి బీచ్‌లో పర్యాటకుల సందడి



సందర్శకులతో కిటకిటలాడుతున్న బీచ్

భీమునిపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్ సందర్శకులతో ఆదివారం కిటకిటలాడింది.వారాంతపు సెలవు కావడంతో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో పాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కొందరు ఇసుక తిన్నెల్లో ఆటలు ఆడగా, మరికొందరు సముద్ర స్నానాలు చేస్తూ ఆనందంగా గడిపారు. సందర్శకుల్లో ఎక్కువ మంది కార్లు, ఆటోలు, బైక్‌లు, వ్యాన్‌ల్లో రావడంతో బీచ్ రోడ్‌లో పలుచోట్ల ట్రాఫిక్ స్తంభించింది.

గ్రేటర్‌లో చికెన్ వ్యర్థాల లొల్లి

... 5వ పేజీ తరువాయి

ఫిర్యాదు చేశారు. ఇలా రోజూ ఎక్కడో ఒకచోట చికెన్ వ్యర్థాల కోసం కొట్లాటలు, పోలీసు కేసులు నమోదవుతున్నాయి. తాజాగా అన్నవరం వైపు చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న ఐదు వాహనాలను అనకాపల్లి వద్ద కొందరు పట్టుకుని టీమ్ జీవీఎంసీ గ్రూపుతోపాటు ఇతర వాట్సాప్‌గ్రూపుల్లో పోస్టుచేసి దీనివెనుక ఉన్నవారెవరో తేల్చాలంటూ వీడియోలు పెట్టడం చర్చనీయాంశంగా మారింది. ఇంత జరుగుతున్నా జీవీఎంసీ అధికారులు మాత్రం చికెన్ వ్యర్థాలను చేపల చెరువులకు తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు దారితీస్తోంది.

సింహాచలం దేవస్థానం సిబ్బందికి అంతర్గత బదిలీలు

సింహాచలం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పలువురు అధికారులను అంతర్గత బదిలీలు చేస్తూ ఈఓ వేంద్ర త్రినాథరావు ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. కొందరికి ఇప్పటివరకు ఉన్న విధులతో పాటు అదనపు బాధ్యతలు కేటాయించగా మరికొందరికి విభాగాలను మార్చారు. సహాయ కార్యనిర్వాహణాధికారి ఎన్‌వీఎస్ నరసింహరాజుకు అదనంగా సెక్యూరిటీ విభాగం బాధ్యతలు అప్పగించారు.భూ పరిరక్షణ విభాగం పర్యవేక్షణాధికారిగా, భైరవస్వామి ఆలయ నిర్వహణను పర్యవేక్షిస్తున్న కేవీ రమణను ఆ బాధ్యతల నుంచి తప్పించి భూ విభాగం, న్యాయ విభాగం, ప్రింటింగ్ అండ్ స్టేషనరీ విభాగాలకు బదిలీ చేశారు. విజయనగరంలోని దేవస్థానానికి చెందిన స్టూడెంట్ వసతి గృహం, నిద్దాం భూముల బాధ్యతలు నిర్వహిస్తున్న పర్యవేక్షణాధికారి పాలూరి నరసింగరావును ప్రొటోకాల్, సింహగిరిపై వసతి సౌకర్యం, సెక్యూరిటీ విభాగాలకు బదిలీ చేశారు. అప్పన్న ఆలయ పర్యవేక్షణాధికారిగా ఉన్న జీవీవీఎస్‌కె ప్రసాద్‌ను కొండదిగువ ఉన్న దేవస్థానం అనుబంధాలయాలు, గోశాల, కొండదిగువ వసతి గృహాలు, విజయనగరంలోని దేవస్థానానికి చెందిన విద్యార్థుల వసతి గృహం బాధ్యతలను అప్పగించారు. పర్యవేక్షణాధికారి జి. నాగసత్యవాణిని జనరల్, ఆర్‌టీఐ, స్పందన, కొండదిగువ అనుబంధాలయాలు, కృష్ణాపురం గోశాల, ప్రహ్లాద ప్రకృతి చికిత్సాలయం, పూదోట, దేవస్థానం స్కూల్, ఆగమ పాఠశాల విద్యార్థుల హాస్టల్ బాధ్యతల నుంచి తప్పించి లీజెస్ అండ్ అకౌంట్స్ విభాగాలకు మార్చారు. పర్యవేక్షణాధికారి ఎన్‌వీ ప్రసన్న లక్ష్మిని ప్రింటింగ్ అండ్ స్టేషనరీ బాధ్యతల నుంచి ప్రసాదాల తయారీ, విక్రయ కేంద్రాలకు బదిలీ చేశారు. అలాగే మరో పర్యవేక్షణాధికారి సివివి పద్మనాభరాజు (విక్రమ్)ను సేవా వలంటీర్ల నిర్వహణకు ప్రత్యేక అధికారిగా, క్షేత్రదర్శిని, సీసీ కెమెరాల నిర్వహణ బాధ్యతలకు కేటాయించారు. పర్యవేక్షణాధికారి గాయత్రికి ప్రస్తుతం చేస్తున్న ఆగమ పాఠశాల, దేవస్థానం హైస్కూల్, ఆడిట్, పాలకమండలి లావాదేవీల నిర్వహణలతో పాటు అదనంగా జనరల్ సెక్షన్ విధులు అప్పగించారు. జె. లక్ష్మణరావును పీఆర్‌ఓ కార్యాలయం నుంచి భూ పరిరక్షణ విభాగం, భైరవస్వామి ఆలయం, కొండదిగువ పారిశుధ్య విభాగాలకు బదిలీ చేశారు. భూపరిరక్షణ, లీజెస్, న్యాయ విభాగం బాధ్యతలు నిర్వహిస్తున్న బి. సత్య శ్రీనివాస్‌కు దేవాలయ పర్యవేక్షణాధికారిగా నియమించారు. పీఆర్‌ఓ కార్యాలయం బాధ్యతలు చూస్తున్న వెంకటేశ్వరరావుకు అన్నప్రసాద విభాగం ఉత్తర ప్రత్యుత్తరాలు, నిర్వహణను అప్పగించారు. జూనియర్ అసిస్టెంట్లు ఎస్. లక్ష్మీప్రశాంత్, ఎన్. సందీప్, ఆర్. గణేష్‌కుమార్, కె. కృష్ణ, ఎస్. లక్ష్మణప్రసాద్, రికార్డు అసిస్టెంట్ ఎస్. పద్మజ, బేసిక్ పే హోల్డర్ చక్రవర్తిని కూడా తమ విభాగాల నుంచి బదిలీ చేస్తూ ఈఓ ఉత్తర్వులు జారీ చేశారు.

సంపాదన సాఫల్య కేంద్రాలు!

... 5వ పేజీ తరువాయి

జంటలను తీసుకురావడం వారి బాధ్యత.ఇందుకోసం వారికి భారీ మొత్తంలో చెల్లిస్తుంటారు. జిల్లాలో ప్రస్తుతం 50 సంతాన సాఫల్య కేంద్రాలున్నాయి. వీటిలో తొమ్మిది కేంద్రాలకు సరోగసీ నిర్వహించేందుకు అనుమతి ఉంది. అయితే, ఈ కేంద్రాల పేరుతో కొన్నిచోట్ల అడ్డగోలు వ్యవహారాలు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. ఒకసారి సంతాన సాఫల్య కేంద్రానికి వెళితే జేబులు ఖాళీ అవుతాయని చెబుతారు. పరీక్షల పేరుతో ప్రారంభంలోనే సుమారు రూ.50 వేల వరకు వసూలు చేస్తారని, ఐవీఎఫ్, ఇతర విధానాలకు సిద్ధపడితే కనీసం రూ.3 లక్షల వరకు ఖర్చు చేయాల్సిందేనని చెబుతున్నారు. అది కూడా వంద శాతం సక్సెస్ రేటు ఉండదని, ఫెయిల్ అయితే మరోసారి ప్రయత్నించాల్సిందేనంటున్నారు. దీనికి మళ్లీ డబ్బులు చెల్లించాల్సిందేనని వాపోతున్నారు. చికిత్స జరిగినంత కాలం ప్రక్రియకు సంబంధించిన రిపోర్టులు, ఇతర వివరాలను బయటకు ఇవ్వరు. కొంతకాలం తరువాత సదరు మహిళ కూడా అదే కేంద్రంలో ఉండాల్సి ఉంటుందంటున్నారు.

నిరుపేదలే లక్ష్యం..

కొన్ని సంతాన సాఫల్య కేంద్రాల నిర్వాహకులు వీర్య కణాల దానం పేరుతో పెద్దఎత్తున వ్యాపారం సాగిస్తున్నట్టు చెబుతున్నారు. తాజాగా సృష్టి కేసు విచారిస్తున్న పోలీసులు దిమ్మతిరిగే విషయాలను గుర్తించారు. అనేకమంది నుంచి సేకరించిన స్పెర్మ్‌ను చూసి అవాక్కయ్యారు. అనేక ఫెర్టిలిటీ సెంటర్ల నిర్వాహకులు ఇదే తరహాలో భారీగా స్పెర్మ్ కలెక్ట్ చేస్తున్నట్టు చెబుతున్నారు. నగరంలోని చాలా కేంద్రాల్లో ఇది యథేచ్ఛగా సాగుతోందంటున్నారు. స్పెర్మ్ దానం చేసేందుకు వచ్చే యువతకు భారీ మొత్తంలో చెల్లిస్తుంటారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న యువతను ఏజెంట్లు బుక్ చేసుకుంటారు. ఈ విషయాన్ని బయటకు రానీయకుండా జాగ్రత్త పడుతుంటారు. అయితే, ఇలా సేకరించిన స్పెర్మ్‌ను కొన్నిసార్లు సంతానం కోసం వచ్చే జంటలకు తెలియకుండా, వారి అనుమతి లేకుండా గర్భ ధారణ కోసం వినియోగిస్తుంటారనే ఆరోపణలున్నాయి. ఇదే ఇప్పుడు సృష్టి సెంటర్ కేసుకు కారణమైంది. ఇటు వంటి వ్యవహారాలే నగరంలో అనేక చోట్ల జరుగుతున్నట్టు చెబుతున్నారు. కొన్నిచోట్ల అనధికారికంగా సరోగసీ చేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఈ ప్రక్రియలో కొంతమంది అమాయక, ఆర్థిక అవసరాలు ఉన్న మహిళలను బలి పశువులు చేస్తున్నారని చెబుతున్నారు. ఆర్థిక అవసరాల కోసం పలువురు మహిళలు అద్దెకు గర్భాలు ఇస్తున్నారని, ఈ క్రమంలో కొంతమంది ప్రాణాలను కోల్పోతుంటే, ఇంకొందరు శారీరకంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటున్నారు. ఈ తరహా అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడిన కేంద్రాలపై గతంలోనూ ఆరోపణలు రావడంతో అధికారులు విచారణ చేపట్టారు.తాజాగా సృష్టి ఉదంతం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఆరోగ్యశాఖ అధికారులు సంతాన సాఫల్య కేంద్రాలను తనిఖీ చేయాలంటున్నారు. ఈ వ్యవహారాలపై ఇప్పటికే దృష్టి సారించామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు పేర్కొన్నారు. ఫెర్టిలిటీ సెంటర్లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తాజా వ్యవహారం నేపథ్యంలో ఫెర్టిలిటీ సెంటర్లలో తనిఖీలు చేస్తామన్నారు.

సీనరేజ్ కాంట్రాక్ట్ కోసం పట్టు

... 5వ పేజీ తరువాయి

లేటరైట్ క్వారీలు ఉండగా, అల్లూరి జిల్లాలోని పాడేరు డివిజన్, విశాఖ జిల్లాలో తక్కువగా క్వారీలున్నాయి. అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, విశాఖ, పాడేరులో గనుల శాఖ ఏడీ కార్యాలయాలున్నాయి. ప్రభుత్వం నుంచి లైసెన్సులు తీసుకున్న క్వారీల నుంచి పూర్తిగా ఆదాయం రావడం లేదు. అనుమతి లేకుండా అనేక క్వారీల నుంచి వందల లారీల రాళ్లు, గ్రావెల్ తరలిపోతోంది. గ్రావెల్ మాఫియా ప్రతి నెలా రూ.కోట్ల విలువైన మట్టి, గ్రావెల్‌ను అనధికారికంగా తవ్వి, తరలిస్తోంది. అనకాపల్లి జిల్లాలో మెటల్ క్వారీల నుంచి ప్రతి రోజూ వందల లారీలతో బండరాళ్లను రాంబిల్లి వద్ద నేవల్ బేస్ నిర్మాణాల కోసం తరలిస్తున్నారు. వీరెవరూ ప్రభుత్వానికి పైసా చెల్లించడం లేదు. కాగా నాతవరం మండలం సరుగుడు, సుందరకోట పంచాయతీల పరిధిలో లేటరైట్ తవ్వకాలకు సంబంధించి ఇప్పటివరకు పక్కాగా లెక్కలు లేవు. కాంట్రాక్టరు చెప్పింది రాసుకోడం తప్ప గనులశాఖ పట్టించుకోవడం లేదు. లేటరైట్ తవ్వకాల నుంచి ప్రభుత్వానికి ఆదాయం రావడం లేదు. ఈ నేపథ్యంలో సీనరేజ్ వసూళ్ల కాంట్రాక్టును ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని గనుల శాఖ అధికారులు భావిస్తున్నారు.

కాంట్రాక్టు సంస్థల పోటీ

ఉమ్మడి జిల్లాలో గనుల శాఖకు ఇప్పటివరకు నెలకు రూ.11 కోట్లు ఆదాయం వస్తోంది. వసూళ్ల బాధ్యత ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే నేపథ్యంలో ఆదాయం పెరుగుతుందని భావించిన అధికారులు రూ.16 కోట్లకు టెండర్లు ఖరారుచేశారు. పోటీ ఉన్నందున కాంట్రాక్టు రూ.20 కోట్లకు చేరుతుందని, దీనివల్ల నెలకు రూ.9 కోట్ల చొప్పున ఏడాదికి సుమారు రూ.102 కోట్ల అదనపు ఆదాయం లభిస్తుందని అంచనా వేస్తున్నారు. దీంతో పాటు అనధికార క్వారీయింగ్, దొంగతనంగా లారీల్లో గ్రావెల్, రాళ్లు, గ్రానైట్, లేటరైట్ తరలింపునకు చెక్ పడుతుందని భావిస్తున్నారు.

ప్రభుత్వ పరిశీలనలో దసపల్లా భూములు

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. వైసీపీ హయాంలో పెట్టుబడులకు పెట్టేందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలను జగన్ వెళ్లగొట్టారని ఆరోపించారు. సింగపూర్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి.. అక్కడ పారిశ్రామికవేత్తలను కలిసి పెట్టుబడులను ఆహ్వానిస్తున్నారన్నారు. జగన్ హయాంలో నకిలీ మద్యం విక్రయించారని, మద్యం షాపుల్లో డిజిటల్ చెల్లింపులు లేకపోవడం వెనుక కుట్రకోణం ఉందన్నారు. భూముల అక్రమ లావాదేవీలపై విచారణ చేస్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గండి బాబ్జి, పాలమరశెట్టి శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ పాల్గొన్నారు


వీధి రోడ్లు మిలమిల

» మరమ్మతులు చేపట్టడంతో తప్పిన ఇబ్బందులు


మరమ్మతులు చేపట్టిన రహదారి

ఎంవీపీ కాలనీ, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ఇన్నాళ్లూ వీధి రోడ్లలో గతుకులతో నడవడానికి, వాహన చోదకులకు ఉన్న ఇబ్బందులు తాజాగా గట్టెక్కాయి. జీవీఎంసీ 18వ వార్డు పరిధిలోని ఎంవీపీ కాలనీలోని వివిధ వీధుల్లో రహదారులను ఇటీవల మరమ్మతులు చేపట్టారు. దీంతో రాకపోకలకు అనువుగా రహదారులు ఉన్నాయంటూ స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయల జీవీఎంసీ నిధులతో కాలనీలోని అంతర్గత రహదారులను నిర్మించారు. కాగా, ఈ వార్డు పరిధిలోని ఇంకా కొన్ని కొన్ని చోట్ల గోతులతో కూడిన రహదారులు ఉన్నాయి. వీటిని కూడా త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

స్టార్ ఆఫ్ ఇండియా క్రీడాకారుడు సదాశివరెడ్డి మృతి


సదాశివరెడ్డి (ఫైల్‌ఫోటో)

విశాఖపట్నం స్పోర్ట్స్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఎండాడకు చెందినప్రముఖ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, స్టార్ ఆఫ్ ఇండియా అవార్డు గ్రహీత, హిందుస్తాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్) రిటైర్డ్ ఉద్యోగి సదాశివరెడ్డి (85)ఆదివారం అనారోగ్యంతో కన్నుమూశారు. బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారునిగా అంతర్జాతీయ, జాతీయస్థాయి టోర్నీల్లో అనేక విజయాలు సాధించి దేశంలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకరిగా పేరొందారు. ఉన్నతస్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దడమే కాకుండా హిందుస్తాన్ షిప్‌యార్డు లిమిటెడ్‌లో ప్రావిడెంట్ ఫండ్ విభాగంలో విశేష సేవలందించి ఉద్యోగ విరమణ పొందారు. కేవలం బాల్ బ్యాడ్మింటన్ క్రీడలోనే కాకుండా వివిధ క్రీడాంశాలలో అనేక మందికి మార్గదర్శకం చేయడంతో పాటు స్ఫూర్తిగా నిలిచిన సదాశివరెడ్డి మృతి పట్ల అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ఎం.నారాయణరావు, ఇతర క్రీడాకారులు, కోచ్‌లు సంతాపం ప్రకటించారు.

'పాలస్తీనాపై దాడులు అన్యాయం'

సిరిపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి) : పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న మారణహోమంలో వివిధ రూపాల్లో మహీంద్రా సహకారం అందిస్తోందని ఇండియన్ పీపుల్ ఇన్ సాలిడారిటీ విత్ పాలస్తైన్ సభ్యుడు సుజిత్ ఆరోపించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లోని మహీంద్రా అవుట్‌లెట్ ముందు ఆదివారం ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లో ముంబైలో ఈ సమావేశంలో మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా బెంజిమిన్ నెతన్యాహుతో కలిసి ఇజ్రాయిల్ ఆర్థిక వ్యవస్థతో బలమైన సంబంధాలను పెంపొందించుకోవడానికి అంగీకరించారన్నారు.

సినిమా గైడ్

● **హరిహర వీరమల్లు** : జగదాంబ, శారద, రమాదేవి, మెలోడి, వెంకటేశ్వర, శ్రీవెంకటేశ్వర, లీలామహల్, సంగం, శ్రీరామా, కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య కన్య, శ్రీకన్య హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)

● **జూనియర్** : శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

● **తమ్ముడు** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 40, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 34, పచ్చిమిర్చి 72, కాకరకాయలు 26, బీరకాయలు 32, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 24, క్యారెట్ 44,దొండకాయలు 26, బంగాళదుంపలు 16, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 42, అల్లం (పాతది) 66, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 50, దోసకాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 80, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 80, కీరదోస 30, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 44, కంద 42, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

కాలువల నిర్మాణంలో కానరాని నాణ్యత

» 22వ వార్డులో నాసిరకం పనులు
» నిర్మించిన నాలుగు నెలలకే పెచ్చులూడుతున్న వైనం
» అధికారుల పర్యవేక్షణ కరువు

మద్దిలపాలెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 22వ వార్డులో కాలువల నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నాణ్యతకు తిలోదకాలిచ్చి ఇసుక కంటే క్రషర్ డస్ట్ ఎక్కువగా వినియోగిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సిమెంట్ కూడా తక్కువగా వాడడంతో డ్రైనేజీ నిర్మాణాలు పేలవంగా కనిపిస్తున్నాయని పలువురు అంటున్నారు.

పిఠాపురం కాలనీలోని ముత్తూట్ ఫైనాన్స్ రహదారిలో సుమారు రూ.5 లక్షలతో ఇటీవల కాలువల నిర్మాణం చేపట్టారు. అయితే నాలుగు నెలలు గడవక ముందే ఇక్కడ డ్రైనేజీలు పాడవుతున్నాయి. ఎక్కడికక్కడే పెచ్చులూడి అధ్వానంగా తయారయ్యాయి. డ్రైనేజీ కింద భాగంలో వేయాల్సిన కాంక్రీట్‌లో కూడా కక్కుర్తి పడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి.

అంతేకాకుండా పిఠాపురంకాలనీ కళాభారతి రోడ్డులో రూ.36 లక్షల నిధులతో కాలువ నిర్మాణం జరుగుతోంది. ఈ నిర్మాణాలు మరింత దారుణంగా ఉన్నాయన్న విమర్శలు ఉన్నాయి. ఇక్కడ కాలువలపై ఫుట్‌పాత్ నిర్మాణం కూడా చేపడుతున్నారు. కానీ పనుల్లో నాణ్యత లేకుండా ఉందంటూ పలువురు పెదవి విరుస్తున్నారు. పనులు మరీ నాసిరకంగా ఉంటున్నాయంటూ నిపుణులు సైతం అభిప్రాయ పడుతున్నారు. ఇంకా పనులు పూర్తి కాక ముందే పరిస్థితి ఇలా ఉంటే వీటివల్ల ఉపయోగం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారులు పర్యవేక్షణ లేకపోవడం, ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి లేకపోవడం వల్లే నిర్మాణాలను నాసిరకంగా చేపడుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. కళ్ల ముందే నాసిరకంగా పనులు చేపడుతున్నా పట్టించుకునే నాథుడే లేకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పనుల నాణ్యత పర్యవేక్షించాలని స్థానికులు కోరుతున్నారు.


నిర్మాణం చేసిన నాలుగు నెలలకే పెచ్చులు ఊడుతున్న ముత్తూట్ ఫైనాన్స్ రోడ్డులో డ్రైనేజీ


కళాభారతి రోడ్డులో నాసిరకంగా నిర్మాణం చేపట్టిన కాలువ

అబ్దుల్ కలాంకు బీజేపీ నేతల నివాళి


అబ్దుల్ కలాంకు నివాళులు అర్పిస్తున్న పరశురామ్‌రాజు, బీజేపీ ఇతర నేతలు

పెదవాల్తేరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు షేక్ నూర్ బాషా షరీఫ్ అధ్వర్యంలో బీజేపీ నగర కార్యాలయంలో ఆదివారం ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామ్‌రాజు విచ్చేసి అబ్దుల్ కలాం చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అణు, శాస్త్రీయ రంగాలకు మార్గనిర్దేశం చేసిన దార్శనికుడు, యువతకు స్ఫూర్తి ప్రధాత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్టేట్ మైనారిటీ మోర్చా ఉపాధ్యక్షులు మోహన్, లాస్ట్ నాయకులు ఎం. సన్యాసిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి శిరసపల్లి నూకరాజు, లంకా శ్రీరామ్, కారాల మహేష్, శేషులత,రాకేష్, శ్రీరంగం దానేశ్వరరావు, కార్తీక్, మూల వెంకటరావు, పేరిచర్ల రూపదేవి, భారతి ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రుక్మిణీ కల్యాణం


రుక్మిణి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

27ఎమ్‌డిపి3: మద్దిలపాలెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో రుక్మిణి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ముందుగా విశ్వక్సేనుడి పూజ నిర్వహించి పుణ్యాహవచనం చేసిన జలాన్ని పూజాద్రవ్యాలు, భక్తులపై సంప్రోక్షణ చేశారు. తిరుపతి నుంచి తెప్పించిన కంకణాలను స్వామివారికి, అమ్మవారికి కంకధారణ చేశారు. జీలకర్ర బెల్లం, మంగళసూత్రధారణ, ముత్యాల తలంబ్రాలు, మంత్రపుష్పం, మంగళహారతి సమర్పించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. అనంతరం పెళ్లి భోజనం పెట్టి కల్యాణం ముగించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణ, కార్యదర్శి రాంబాబు, కోశాధికారి రామ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జూ పార్కుకు సందర్శకుల తాకిడి

» రూ.2,72,180 ఆదాయం


సందర్శకులతో కళకళలాడుతున్న జూపార్కు

ఆరిలోవ, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల ఆదివారం సందర్శకులతో కిటకిట లాడింది. జూ పార్కును రెండువేల 8 వందల 74 మంది సందర్శించినట్టు క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. వీరి నుంచి రూ.2,72,180 ఆదాయం సమకూరింది. పలువురు సందర్శకులు తమ వెంట ఆహార పదార్థాలు తెచ్చుకొని చెట్ల మధ్య కూర్చొని భోజనాలు, ఫలహారాలు చేశారు. అలాగే కంబాల కొండ కూడా సందర్శకులతో కళకళలాడింది. చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. సెల్ఫీలు దిగుతూ ఉత్సాహంగా గడిపారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు

» దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్
» జిల్లా యాదవ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

మద్దిలపాలెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును నిర్మించుకోగలరని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ పేర్కొన్నారు. విశాఖ జిల్లా యాదవ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సవేరా ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు ఆయన ప్రతిభాపురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యంతో కూడి విద్య అవసరమన్నారు. ఏ రంగంలోనైనా ప్రతిభ కనబరిస్తేనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటామన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్ణయించుకుని ఆ లక్ష్యాలు సాధించేందుకు కష్టపడాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఒమ్మి సన్యాసిరావు, బొట్టా వెంకటరమణ, ప్రగడ చిన్నారావు, ఉరుకూటి రాజారావు, డొక్కర శ్రీనివాస్, శీరం రవి, జగన్, నూకరాజు పాల్గొన్నారు.


విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేస్తున్న జిల్లా యాదవ సంఘం ప్రతినిధులు

అన్నసమారాధన


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రతాప్

ఆరిలోవ, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12 వ వార్డు సంతపాలెంలో వెలసిన గ్రామ దేవత ముత్యాలమ్మ జాతర సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వాహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వెలగపూడి రామకృష్ణబాబు కుమారుడు వెలగపూడి ప్రతాప్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు రెండు వేల మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో పీతల పత్తి రాజేశ్, ఉప్పిలి గోపి, లొడగల వాసు పాల్గొన్నారు.

సినీ రంగంలో నటనతో పాటు అదృష్టం ఉంటేనే రాణింపు


» ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్టు వడ్లమాని సత్యసాయి శ్రీనివాస్


వడ్లమాని శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సినీ రంగంలో రాణించాలంటే నటనతో పాటు అదృష్టం కూడా తోడవ్వాలని ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్టు డా.వడ్లమాని సత్యసాయి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సాయంత్రం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో మిషన్ కర్షక దేవోభవ నేషనల్ చైర్మన్ ఆడారి కిషోర్‌కుమార్, నిర్మాత పీఎన్ తిలక్ ఆధ్వర్యంలో పూర్వ జాయింట్ కలెక్టర్, ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్టు వడ్లమాని శ్రీనివాస్ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన దామోదరం సంజీవయ్య నేషనల్ న్యాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ దాసరి సూర్యప్రకాశరావు, వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావులు జ్యోతి ప్రజ్వలన చేశారు. దాసరి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ మంచి సినిమా ద్వారా ప్రజలను మంచి మార్గంలో నడిపించవచ్చునన్నారు. నరవ ప్రకాశరావు మాట్లాడుతూ విశాఖ నుంచి వెళ్లిన శ్రీనివాస్ మరిన్ని చిత్రాల్లో రాణించాలని, విశాఖ కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. ఆడారి కిషోర్‌కుమార్ మాట్లాడుతూ విశాఖ నుంచి వెళ్లి సినీ రంగంలో రాణిస్తున్న శ్రీనివాస్ స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. సన్మాన గ్రహీత వడ్లమాని శ్రీనివాస్ మాట్లాడుతూ సినిమాల్లోకి ధైర్యంతోనే ముందుకు వెళ్లాలన్నారు. తన నటనతో పాటు అదృష్టం కూడా తోడై కొద్ది కాలంలోనే మంచి ఆర్టిస్టుగా పేరు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లో తనకంటూ ప్రత్యేకత చూపడమే లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో గవర కార్పొరేషన్ చైర్మన్ సురేంద్ర, కె.వినోద్‌బాబు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ సంస్థలకు రూ.వేల కోట్ల భూముల కేటాయింపా?

» వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మద్దిలపాలెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలో రూ.వేల కోట్ల విలువైన భూములను కారుచౌకగా రియల్‌ఎస్టేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. మద్దిలపాలం వైసీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఊరుపేరూ లేని ఉర్సా సంస్థకు 60 ఎకరాల భూమిని కేటాయించరని విమర్శించారు. సత్వ, కపిల్ రియల్ ఎస్టేట్ సంస్థలకు ఇరవై, ముప్పై ఎకరాలు ఏ ప్రాతిపదికన కట్టబెట్టారని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన ప్రభుత్వమే ఇలా రూ.వేల కోట్ల భూములను తమ వారికి అప్పనంగా ఇచ్చేస్తుండడం బాధాకరమన్నారు. చంద్రబాబుకు ఆంధ్ర అంటే 'అమరావతి' ఒక్కటే కనిపిస్తుందన్నారు. అందుకే అమరావతి తప్పితే ఎక్కడా ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టడం లేదని విమర్శించారు. చంద్రబాబు పెట్టుబడులన్నీ సింగపూర్‌లోనే పెడతారని, అందుకే అధికారంలోకి ఎప్పుడు వచ్చిన సింగపూర్ మంత్రం జపిస్తుంటారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వచ్చిన పెట్టుబడులు, అభివృద్ధి పనులే ప్రస్తుతం జరుగుతున్నాయని, 14 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం ఏమీ చేయలేదని విమర్శించారు.

మల్లాది శ్రీకాంత్‌కు ఏయూ డాక్టరేట్


వీసీ రాజశేఖర్ నుంచి పీహెచ్‌డీ డిగ్రీ అందుకుంటున్న శ్రీకాంత్

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా యూనివర్శిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగ పరిశోధక విద్యార్థి మల్లాది శ్రీకాంత్‌కు ఏయూ డాక్టరేట్ లభించింది. 'ఉద్యోగి జీవిత చక్ర నిర్వహణ, సంస్థ పనితీరు పై దాని ప్రభావం' అనే అంశంపై ప్రొఫెసర్ పుట్టపల్లి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించి న పరిశోధనకు శ్రీకాంత్‌కు డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ చేతులు మీదుగా డాక్టరేట్‌ను ఆయన అందుకున్నారు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరీస్ లిమిటెడ్‌లో గడిచిన 31 ఏళ్లుగా పని చేస్తున్న ఆయన ఈ అంశాన్ని పరిశోధనకు ఎంచుకుని పూర్తి చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ను పలువురు అభినందించారు.

ఫుట్‌పాత్ నిర్మాణాన్ని అడ్డుకున్న చిరు వర్తకులు


కాంట్రాక్టర్‌కు కోర్టు ఆదేశాలను వివరిస్తున్న న్యాయవాది శ్రీరామ్మూర్తి

మద్దిలపాలెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీ కళాభారతి రోడ్డులో జరుగుతున్న ఫుట్‌పాత్ నిర్మాణ పనులను ఆదివారం చిరువర్తకులు అడ్డుకున్నారు. కోర్టు స్టేటస్ కో ఆర్డర్ ఉండగా, నిర్మాణాలు ఎలా చేపడతారంటూ సచివాలయ ఉద్యోగులు, కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో చిరువర్తకులు, కాంట్రాక్టర్ మధ్య వివాదం తలెత్తింది. ఇంతలో న్యాయవాది పలక శ్రీరామ్మూర్తి ఫుట్‌పాత్ నిర్మాణాల వద్దకు చేరుకున్నారు. కళాభారతి రోడ్డులో తోపుడు బండ్ల వ్యాపారాలు చేసుకుంటున్న 26 మందికి ఇక్కడ వ్యాపారాలు నిర్వహించుకోవడానికి కోర్టు ఇచ్చిన స్టేటస్ కో-ఆర్డర్‌ను కాంట్రాక్టర్‌కు చూపించారు. కోర్టు ఆదేశాలు ఉండగా పనులు చేయకూడదని వివరించారు. స్థానిక కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ హైకోర్టులో కేసు వేసి కళాభారతి రోడ్డులో చిరువ్యాపారాలు తొలగించారన్నారు. చిరు వర్తకులు కూడా కోర్టుకెళ్లి వ్యాపారాలు నిర్వహించుకోవడానికి ఆర్డర్ తెచ్చుకున్నారన్నారు. ఏ విధంగానైనా తోపుడుబండ్లు తొలగించాలనే దురుద్దేశంతో అవసరం లేకపోయినా కార్పొరేటర్ పీతల మూర్తి ఇక్కడ ఫుట్‌పాత్ నిర్మాణం చేయిస్తున్నారని విమర్శించారు. ట్రాఫిక్ రద్దీ, బస్టాపులు, విద్యాలయాలుషాపింగ్ కాంప్లెక్స్ ఉండే ప్రాంతాల్లో పాదచారులకు ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేస్తారన్నారు. ఇవేవీ లేని కళాభారతి రోడ్డులో ఫుట్‌పాత్ నిర్మాణం ప్రజాధనం దుర్వినియోగం తప్ప పాదచారులకు ఉపయోగం లేదన్నారు. ఫుట్‌పాత్‌నిర్మాణాలపై జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

ఆగస్టులో బనారస్, నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌లు సహా పలు రైళ్లు రద్దు

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సంబల్‌పూర్ స్టేషన్‌లో నాన్ ఇంటర్ లాకింగ్, యార్డు ఆధునికీకరణ జరగనున్న నేపథ్యంలో బనారస్, నాందేడ్‌ఎక్స్‌ప్రెస్‌లు సహా పలు రైళ్లను రద్దు చేస్తూ, మరికొన్నింటిని మళ్లింపు మార్గంలో నడిపించనున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

రద్దయిన రైళ్లు: ఆగస్టు 10, 13 తేదీల్లో విశాఖ-బనారస్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ (18523), ఆగస్టు 11, 14 తేదీల్లో తిరుగు ప్రయాణంలో బనారస్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18524), ఆగస్టు 8, 10, 11, 15 తేదీల్లో సంబల్‌పూర్-నాందేడ్ ఎక్స్‌ప్రెస్ (20809), ఆగస్టు 9, 11, 12, 16 తేదీల్లో తిరుగు ప్రయాణంలో నాందేడ్-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (20810), ఆగస్టు 7 నుంచి 16 వరకు సంబల్‌పూర్-రాయగడ ఎక్స్‌ప్రెస్ (18301), రాయగడ-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (18302)లు రద్దు జాబితాలో ఉన్నాయన్నారు.

దారి మళ్లింపు: టాటా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189) ఆగస్టు 8 నుంచి 14 వరకు విజయనగరం మీదుగా ఝార్సుగూడ రోడ్డు, సంబల్‌పూర్ సిటీ, నారజ్ నార్తాపూర్, అనుగుల్, ఖుర్దారోడ్డు, తిరుగు ప్రయాణంలో ఎర్నాకులం-టాటా ఎక్స్‌ప్రెస్ (18190) ఆగస్టు 7 నుంచి 13 వరకు విజయనగరం, ఖుర్దారోడ్డు, అనుగుల్, నారజ్ నార్తాపూర్, సంబల్‌పూర్ సిటీ, ఝార్సుగూడ రోడ్డు మీదుగా నడుస్తాయి. అలాగే తంబరం-జసిదిహ్ ఎక్స్‌ప్రెస్ (12375) ఆగస్టు 9న విజయనగరం, ఖుర్దారోడ్డు, అనుగుల్, నారజ్ నార్తాపూర్, సంబల్‌పూర్ సిటీ, ఝార్సుగూడ రోడ్డు మీదుగా, తిరుగు ప్రయాణంలో జసిదిహ్-తంబరం ఎక్స్‌ప్రెస్ (12376) ఆగస్టు 13న ఝార్సుగూడ రోడ్డు, సంబల్‌పూర్ సిటీ, నారజ్ నార్తాపూర్, అనుగుల్, ఖుర్దారోడ్డు, విజయనగరం మీదుగా నడుస్తాయి. ఎస్ఎంవీటీ బెంగళూరు-టాటానగర్ ఎక్స్‌ప్రెస్ (12889) ఆగస్టు 8న ఝార్సుగూడ రోడ్డు, సంబల్‌పూర్ సిటీ, నారజ్ నార్తాపూర్, అనుగుల్, ఖుర్దారోడ్డు, విజయనగరం మీదుగా, తిరుగు ప్రయాణంలో టాటానగర్-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12890) ఆగస్టు 11న విజయనగరం, ఖుర్దారోడ్డు, అనుగుల్, నారజ్ నార్తాపూర్, సంబల్‌పూర్ సిటీ, ఝార్సుగూడ రోడ్డు మీదుగా నడుస్తాయి. బెంగళూరు-హటియా ఎక్స్‌ప్రెస్ (12836) ఆగస్టు 12న విజయనగరం, ఖుర్దారోడ్డు, అనుగుల్, నారజ్ నార్తాపూర్, సంబల్‌పూర్ సిటీ, ఝార్సుగూడ రోడ్డు మీదుగా నడుస్తుందని డీసీఎం పేర్కొన్నారు.

వ్యక్తిపై దాడి : ఐదుగురిపై హత్యాయత్నం కేసు నమోదు

» పరారీలో ఉన్న నిందితులు


గాయపడిన మొల్లి సంతోష్‌కుమార్

ఉక్కుటౌన్‌షిప్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిపై దాడి చేసిన సంఘటనకు సంబంధించి ఐదుగురిపై స్టీల్ ప్లాంట్ పోలీసులు హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. దేశపాత్రునిపాలెం ప్రాంతానికి చెందిన మొల్లి సంతోశ్ కుమార్ ఈ నెల 25న పెదగంట్యాడలో చదువుతున్న తమ కుమార్తెను పాఠశాల నుంచి ఇంటికి తీసుకువచ్చేందుకు వెళ్లగా, స్కూల్ సాయంత్రం ఏడు గంటల వరకు ఉంటుందని, అందువల్ల తరువాత రావాలని సిబ్బంది తెలిపారు. దీంతో సంతోశ్‌కుమార్ సమీపంలోని లారీ యార్డులో ఉన్న స్నేహితులు సతీశ్, గణేశ్‌ల వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న పెదగంట్యాడకు చెందిన మొల్లి శివ, మొల్లి శ్రీను, వాసు, రవి, ప్రవీణ్‌లు సంతోశ్‌కుమార్‌పై కర్రతో దాడి చేశారు. అక్కడ నుంచి తప్పించుకున్న సంతోశ్‌కుమార్ స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రికి, అక్కడ నుంచి అగనంపూడి ఏరియా ఆస్పత్రికి చేరుకుని చికిత్స పొందాడు. తనపై దాడి చేసిన వారిపై స్టీల్ ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేశారు. దాడికి పాల్పడిన ఐదుగురూ పరారీలో ఉన్నారని, వారి కోసం మూడు బృందాలు గాలిస్తున్నాయని పోలీసులు పేర్కొన్నారు.

మతోన్మాద దాడిని ఐక్యంగా ఎదుర్కోవాలి

» సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు పిలుపు



మహాసభలో మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు

కంచరపాలెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): దేశంలో మతోన్మాద, కార్పొరేట్ శక్తుల దాడిని కార్మిక వర్గం ఐక్యంగా ఎదుర్కోవాలని సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నరసింగరావు పేర్కొన్నారు. కంచరపాలెం మెట్టు వద్ద గల ఎం స్క్వేర్ ఫంక్షన్ హాల్‌లో విశాఖ జిల్లా సిటు 13వ మహాసభల ముగింపు కార్యక్రమానికి ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో కార్మికవర్గం అణచివేతకు సామ్రాజ్యవాదం పన్నుతున్న కుట్రలను ఎదుర్కోడానికి కార్మికులంతా సిద్ధంగా ఉండాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ రంగ సంస్థలను, దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నా రన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును అడ్డుకుంటున్న కార్మిక వర్గంపైన, నాయకులపైన తీవ్ర నిర్బంధం ప్రయోగించి అణిచివేయడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి యజమానులకు అనుకూలంగా చేయడం దుర్మార్గమన్నారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై సిటు నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పని గంటలు పెంచి కాంట్రాక్టు ఉద్యోగులు, మహిళలను రాత్రి వేళ కూడా విధులు చేయిస్తోందని మండిపడ్డారు.

సమాన పనికి సమానవేతనం ఇవ్వకుండా కాంట్రాక్టు ఉద్యోగుల ఉసురు పోసుకుంటోందన్నారు. సమావేశాల్లో సిటు జిల్లా నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ జట్టుకు క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడాదుస్తులు అందజేస్తున్న మాజీ ఒలింపియన్ ఎంపీ మాణిక్యాలు

విశాఖపట్నం స్పోర్ట్సు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బాలురు, బాలికల గ్రాప్లింగ్ రెజ్లింగ్ జట్ల సభ్యులకు ఆదివారం విశాఖ రైల్వే స్టేషన్‌లో క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. మాజీ ఒలింపియన్ ఎంపీ మాణిక్యాలు ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులకు దుస్తులు అందజేసి ఒత్తిడికి గురికాకుండా రాష్ట్రానికి పతకం అందించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర జట్టు బాలురు, బాలికలు సోమవారం నుంచి బిలాస్‌పూర్‌లో జరగనున్న జాతీయ స్థాయి గ్రాప్లింగ్‌చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొంటారని ఏపీ గ్రాప్లింగ్ సంఘం కార్యదర్శి డి.సాయి సుమతి స్పష్టం చేశారు. అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్‌లు పాల్గొన్నారు.

స్టార్ ఆఫ్ ఇండియా క్రీడాకారుడు సదాశివరెడ్డి మృతి



విశాఖపట్నం స్పోర్ట్సు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎండాడ ప్రాంతానికి చెందిన ప్రముఖ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, స్టార్ ఆఫ్ ఇండియా అవార్డు గ్రహీత, హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) రిటైర్డ్ ఉద్యోగి సదాశివరెడ్డి (85) ఆదివారం అనారోగ్యంతో కన్నుమూశారు. బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారునిగా అంతర్జాతీయ, జాతీయ స్థాయి టోర్నీలలో అనేక విజయాలు సాధించి దేశంలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకరిగా పేరొందారు. ఉన్నత స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దడమే కాకుండా హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్‌లో ప్రావిడెంట్ ఫండ్ విభాగంలో విశేష సేవలందించి ఉద్యోగ విరమణ పొందారు. కేవలం బాల్ బ్యాడ్మింటన్ క్రీడలోనే కాకుండా వివిధ క్రీడాంశాలలో అనేక మందికి మార్గదర్శకం చేయడంతోపాటు స్ఫూర్తిగా నిలిచిన సదాశివరెడ్డి మృతి పట్ల అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ఎం.నారాయణరావు, ఇతర క్రీడాకారులు, కోచ్‌లు సంతాపం ప్రకటించారు.

కాలానుగుణ వ్యాధులపై అవగాహన అవసరం



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మురళీనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిరక్షణకు కనీస శ్రద్ధ చూపాలని వృందా ఆసుపత్రి వైద్యురాలు అఖిల సూచించారు. ఏటా జూలై, ఆగస్టు నెలల్లో వర్షాల ప్రభావంతో వాతావరణ మార్పుల వల్ల తలెత్తే అనారోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆదివారం మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆమె పలు సూచనలు చేశారు. ప్రతి నిత్యం వ్యాయామం, నడక ఉత్తమ ఆరోగ్యమార్గాలని పేర్కొన్నారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.బానుప్రకాష్ పర్యవేక్షణలో జరిగిన శిబిరంలో 195 మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈసీజీ, బీపీ, చక్కెర వ్యాధి, సాధారణ రుగ్మతలకు చికిత్సలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు భరత్, లతాశ్రీ, సహాయక సిబ్బంది, వాకర్స్‌క్లబ్ కార్యదర్శి సీహెచ్ఎస్ఎవీ ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై కార్పొరేటర్ భర్త అనుచిత వ్యాఖ్యలు

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) జ్ఞానాపురంలో ఆదివారం వైసీపీ నిర్వహించిన 'బాబుష్యూరిటీ - మోసం గ్యారంటీ' కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ భర్త కోడిగుడ్ల శ్రీధర్ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. వార్డులోకి ఎమ్మెల్యే వస్తే వీధి వీధిలో 'దుస్తులు ఊడదీసి కొట్టండి' అంటూ కార్యకర్తలను రెచ్చగొట్టేవిధంగా వ్యాఖ్యలు చేశారు. ఈ విషయం తెలిసిన కూటమి నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

భారత్ వికాస్ పరిషత్ వ్యవస్థాపకునికి నివాళి



సూరజ్ ప్రకాశ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

అక్కయ్యపాలెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): భారత్ వికాస్ పరిషత్ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ సూరజ్‌ప్రకాశ్ జయంతి కార్యక్రమాన్ని శంకువానిపాలెంలోని వాగ్దేవి పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వ్యాపారవేత్త రమేష్‌చంద్ జైన్ మాట్లాడుతూ విద్యార్థులకు సంస్కారాన్ని, దేశభక్తిని కలిగించేందుకు సూరజ్ ఈ సంస్థను స్థాపించి చిరస్మరణీయులుగా నిలిచారన్నారు. నిరుపేదలకు ఆహార ప్యాకెట్లను అందజేశారు. ప్రిన్సిపల్ ఎంవీవీ సత్యనారాయణ, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఎంఎస్ఎల్ శైలజ, సీహెచ్‌వీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

» సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



26వ వార్డులో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్య ప్రసాద్



బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును హత్తుకున్న మంత్రి

అక్కయ్యపాలెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. గ్రేటర్ 26వ వార్డులో ఆదివారం జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలతో రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేరుస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ, ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాస్, 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, టీడీపీ అధ్యక్షుడు ముక్కా కిశోర్, నాయకులు లొడగల కృష్ణ, అకిరెడ్డి జగదీష్, బొడ్డేటి మోహన్, వాసుపల్లి రాజు, భరణికాన రాజు, పుక్కళ్ల పైడికొండ, కుట్టా కార్తీక్, ఈతలపాక సుజాత, యాగాటి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయాన్ని సందర్శించిన మంత్రి

సీతమ్మధార, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఉత్తర నియోజకవర్గ కార్యాలయాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్‌లీడర్ పి.విష్ణుకుమార్ రాజు మంత్రికి ఘనస్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యేను మంత్రి ఆప్యాయంగా హత్తుకున్నారు.

విద్యతోనే ఉన్నత స్థాయి గౌరవం: ఎమ్మెల్యే గణబాబు



విద్యార్థినికి ప్రతిభా ప్రోత్సాహకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

కంచరపాలెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉన్నతస్థాయి గౌరవం దక్కుతుందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పేర్కొన్నారు. కేంద్ర గౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం కంచరపాలెం ఆశీర్వాద్ కల్యాణమండపంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రోత్సాహకాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గణబాబు మాట్లాడుతూ గౌరీ సంఘం చేపడుతున్న సేవాకార్యక్రమాలను కొనియాడారు. విద్యార్థులు నిర్దేశించుకున్న గమ్యాన్ని చేరుకోవడానికి అహర్నిశలు శ్రమించాలన్నారు. ఝార్ఖండ్ వీసీ ఆచార్య సూరిశెట్టి జవహర్ మాట్లాడుతూ గురువులు, తల్లిదండ్రులను తగిన విధంగా గౌరవించాలన్నారు. కేంద్ర గౌరీ సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ మాట్లాడారు. అనంతరం 500 మంది గవర విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డా.మళ్లా భాస్కరరావు, పీలా సుజాత, మళ్ల సురేంద్ర, శరగడం రాజశేఖర్, గౌరీ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మాధవధార ప్రాంతంలో పోలీసుల నిఘా



మాధవధార బస్టాప్ ఎదుట వైన్ షాప్ యజమానితో మాట్లాడుతున్న పోలీసులు

మాధవధార, జూలై 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ఎయిర్‌పోర్ట్ జోన్ పోలీసులు దృష్టి సారించారు. సీఐ ఉమామహేశ్వరరావు స్వయంగా వర్తకులతో ఆదివారం మాట్లాడారు. ఈ నెల 8న గ్రామ ఉత్సవంలో యువకుడి హత్య జరిగిన మాధవ యువజన సమాజం పరిసరాలు, వైన్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్ల వద్ద గస్తీ ని ముమ్మరం చేశారు. షాపుల నిర్వాహకులు, భవనాల్ని అద్దెకిచ్చిన యజమానులకు సీఐ నిబంధనలు, పాటించాల్సిన కనీస భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. రాత్రి 10.30 గంటలు దాటాక షాపుల నిర్వహణకు అనుమతి లేదని స్పష్టంచేశారు. అయితే మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లో గొలుసుకట్టుగా నడుపుతున్న పెద్ద వ్యాపారులు తమ దుకాణాల్ని ఉదయం 11 నుంచి రాత్రి 11 వరకు తెరిచి ఉంచడంపై నిర్వాహకులతో మాట్లాడారు. అర్ధరాత్రి వరకు వైన్ షాపుల పరిసరాల్లో నడిచే పాన్ షాపులు, జ్యూస్ సెంటర్లకు హెచ్చరికలు జారీ చేశారు. సిబ్బందితో గస్తీ నిర్వహిస్తున్నట్లు సీఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.

యువత రక్తదానానికి ముందుకు రావాలి



రక్తదానం చేస్తున్న యువత

డాబాగార్డెన్స్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని వాయుపుత్ర హెల్త్‌క్లబ్ డైరెక్టర్ కిలాని గణేష్ పిలుపునిచ్చారు. ఆదివారం రామాటాకీస్ ఎదురుగా వాయుపుత్ర హెల్త్‌క్లబ్‌లో 31వసారి రక్తదాన శిబిరం నిర్వహించారు. జాతీయ బాడీ బిల్డర్ కిలాని శ్రీనివాసు, ప్రముఖ పాత్రికేయుడు కురసాల సురేష్‌ల జ్ఞాపకార్థం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాయత్రి విద్యా పరిషత్ డైరెక్టర్ డి.గిరిధర్, అతిథులుగా ఉమ్మడి విశాఖ జిల్లా ట్రెజరరీ డిపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్ ఎం.జయకుమార్, ఫిల్మ్ డైరెక్టర్ యాదకుమార్, సీహెచ్.రవికుమార్ పాల్గొన్నారు. 38 మంది యువత రక్తదానం చేసినట్లు తెలిపారు. రక్తదాతలకు ధ్రువపత్రాలు అందజేశామన్నారు. సేకరించిన రక్తదాన్ని లైఫ్ షేర్ బ్లడ్‌బ్యాంక్‌కు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర బాడీ లిఫ్ట్ సంఘం ప్రెసిడెంట్ ఎస్.ఎస్.శివశంకర్, విశాఖ జిల్లా జిమ్ యజమానుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కోటిరెడ్డి, పిల్లి సురేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

జనసేన కార్యక్రమాలపై నేతల చర్చ



జనసేన నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, చిత్రంలో మరో ఎమ్మెల్యే పంచకర్ల

సీతమ్మధార, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జనసేన నగర కార్యాలయంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ముఖ్యులతో సమావేశం నిర్వహించారు. జడ్పీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు, వివిధ నియోజకవర్గాలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా రాబోయే రోజుల్లో చేపట్టబోయే వివిధ కార్యక్రమాలు, పార్టీ సంస్థాగత నిర్మాణం, ఇతర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు ఉషాకిరణ్, ప్రశాంతి, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ గోవిందరెడ్డి, జనసేన ఫ్లోర్‌లీడర్ వసంతలక్ష్మి, కార్పొరేటర్లు భాస్కరరావు, నాగరాజు, సాదిక్, ఉషశ్రీ, లీలావతి, మేరీ జోన్స్, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు: వంశీకృష్ణ శ్రీనివాస్

మద్దిలపాలెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును నిర్మించుకోగలరని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. విశాఖ జిల్లా యాదవ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సవేరా ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు ఆయన ప్రతిభాపురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలు సాధించేందుకు కష్టపడాలన్నారు. సంఘం ప్రతినిధులు ఒమ్మి సన్యాసిరావు, బొట్టా వెంకటరమణ, ప్రగడ చిన్నారావు, ఉరుకూటి రాజారావు, డొక్కర శ్రీనివాస్, శీరం రవి, జగన్, నూకరాజు పాల్గొన్నారు.

నటన, అదృష్టం ఉంటేనే సినీ రంగంలో రాణింపు

» క్యారెక్టర్ ఆర్టిస్టు వడ్లమాని సత్యసాయి శ్రీనివాస్ వ్యాఖ్య



క్యారెక్టర్ నటుడు, పూర్వ జాయింట్ కలెక్టర్ వడ్లమాని సత్యసాయి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సినీ రంగంలో రాణించాలంటే నటనతో పాటు అదృష్టం కూడా తోడవ్వాలని ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్టు డా.వడ్లమాని సత్యసాయి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సాయంత్రం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో మిషన్ కర్షక దేవోభవ నేషనల్ చైర్మన్ ఆడారి కిషోర్‌కుమార్, నిర్మాత పీఎస్ తిలక్ ఆధ్వర్యంలో పూర్వ జాయింట్ కలెక్టర్, ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్టు వడ్లమాని శ్రీనివాస్ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన దామోదరం సంజీవయ్య నేషనల్ న్యాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ దాసరి సూర్యప్రకాశరావు, వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావులు జ్యోతి ప్రజ్వలన చేశారు. దాసరి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ మంచి సినిమా ద్వారా ప్రజలను మంచి మార్గంలో నడిపించవచ్చునన్నారు. నరవ ప్రకాశరావు మాట్లాడుతూ విశాఖ నుంచి వెళ్లిన శ్రీనివాస్ మరిన్ని చిత్రాల్లో రాణించాలని, విశాఖ కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. ఆడారి కిషోర్‌కుమార్ మాట్లాడుతూ విశాఖ నుంచి వెళ్లి సినీ రంగంలో రాణిస్తున్న శ్రీనివాస్ స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. సన్మాన గ్రహీత వడ్లమాని శ్రీనివాస్ మాట్లాడుతూ సినిమాల్లోకి ధైర్యంతోనే ముందుకు వెళ్లాలన్నారు. తన నటనతో పాటు అదృష్టం కూడా తోడై కొద్ది కాలంలోనే మంచి ఆర్టిస్టుగా పేరు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లో తనకంటూ ప్రత్యేకత చూపడమే లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో గవర కార్పొరేషన్ చైర్మన్ సురేంద్ర, కె.వినోద్‌బాబు పాల్గొన్నారు.

ఏసీఏ మల్టీ డే క్రికెట్ టోర్నీ విజేత విశాఖ



విశాఖ జట్టు సభ్యులతో కోచ్, మేనేజర్

విశాఖపట్నం స్పోర్ట్సు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్-16 మల్టీ డే అంతర్ జిల్లా క్రికెట్ టోర్నీలో నార్త్ జోన్ విజేతగా విశాఖ నిలిచింది. ఉక్కు స్టేడియంలో శ్రీకాకుళంతో జరిగిన మ్యాచ్‌లో విశాఖ ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించి పాయింట్ల (16) పట్టికలో ప్రథమ స్థానం సాధించింది. టాస్ ఓడి తొలి బ్యాటింగ్ చేసిన శ్రీకాకుళం తొలి ఇన్నింగ్స్‌లో 68.4 ఓవర్లలో 174 పరుగులకు ఆలౌటైంది. వివేక్ నంద హాఫ్ సెంచరీ (66), రుత్విక్ సాగర్ (38) మినహా మిగిలినవారు విఫలమయ్యారు. విశాఖ బౌలర్లలో యతీష్ చంద్ర, చరన్ యాదవ్ చెరో మూడు వికెట్లు, గౌతమ్ ఆర్య రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్ బ్యాటింగ్‌కు దిగిన విశాఖ...45.3 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటైంది. భాను శ్రీహర్ష అజేయ సెంచరీ (140 నాటౌట్, 20 బౌండరీలు, 4 సిక్సర్లు) చేసి జట్టును ఆదుకున్నాడు. మిగిలిన బ్యాటర్లు ఒక్కరు కూడా రెండంకెల స్కోరు చేయలేకపోయారు. శ్రీకాకుళం బౌలర్ ప్రణీత్ ఆరు వికెట్లు పడగొట్టి విశాఖ ఇన్నింగ్స్‌ను దెబ్బతీశాడు. ఎనిమిది పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేసిన శ్రీకాకుళం...33.2 ఓవర్లలో 81 పరుగులకు కుప్పకూలింది. విశాఖ బౌలర్లు భానుస్వరూప్ (4/28), గౌతమ్ ఆర్య (3/28) అద్భుతంగా రాణించి శ్రీకాకుళం బ్యాటింగ్‌ను కట్టడి చేశారు. 90 పరుగుల విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు దిగిన విశాఖ...38.1 ఓవర్లలో నాలుగు వికెట్లు నష్టపోయి 90 పరుగులు చేసి విజయం సొంతం చేసుకుంది.

మతోన్మాద దాడిని ఐక్యంగా ఎదుర్కోవాలి

» సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు పిలుపు



సభలో మాట్లాడుతున్న సీహెచ్.నరసింగరావు

కంచరపాలెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): దేశంలో మతోన్మాద, కార్పొరేట్ శక్తుల దాడిని కార్మిక వర్గం ఐక్యంగా ఎదుర్కోవాలని సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నరసింగరావు పేర్కొన్నారు. కంచరపాలెం మెట్టు వద్ద గల ఎం స్క్వేర్ ఫంక్షన్‌హాల్‌లో విశాఖ జిల్లా సిటు 13వ మహాసభల ముగింపు కార్యక్రమానికి ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో కార్మికవర్గం అణచివేతకు సామ్రాజ్యవాదం పన్నుతున్న కుట్రలను ఎదుర్కోడానికి కార్మికులంతా సిద్ధంగా ఉండాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ రంగ సంస్థలను, దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును అడ్డుకుంటున్న కార్మిక వర్గంపైన, నాయకులపైన తీవ్ర నిర్బంధం ప్రయోగించి అణచివేయడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి యజమానులకు అనుకూలంగా చేయడం దుర్మార్గమన్నారు. ప్రజావ్యతిరేక నిర్ణయాలపై సిటు నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పని గంటలు పెంచి కాంట్రాక్టు ఉద్యోగులు, మహిళలను రాత్రి వేళ కూడా విధులు చేయిస్తోందని మండిపడ్డారు. సమాన పనికి సమానవేతనం ఇవ్వకుండా కాంట్రాక్టు ఉద్యోగుల ఉసురు పోసుకుంటోందన్నారు. సమావేశాల్లో సిటు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన



అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ప్రతినిధికి రాజ్యాంగ ప్రతిని అందిస్తున్న అతిథులు

సీతమ్మధార, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అంబేడ్కర్ భవన్‌లో 'బుద్ధునితో నా ప్రయాణం' తెలుగు నాటకాన్ని ఆదివారం సాయంత్రం ప్రదర్శించారు. ఈ నాటకాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, కార్పొరేటర్ గంగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీకి భారత రాజ్యాంగం అసలు ప్రతిని వంశీకృష్ణ బహూకరించారు. హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ అకాడమీకి చెందిన 40 మంది కళాకారులు ఈ నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో బొడ్డు కల్యాణరావు, జేవీ ప్రభాకర్, బత్తుల గౌతమ్‌బాబు పాల్గొన్నారు.

ఇద్దరికి జనకవి బిరుదులు ప్రదానం



సత్కారం పొందిన రామకృష్ణానంద, దుర్గాప్రసాద్

సీతమ్మధార, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మాతా కళాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం పౌర గ్రంథాలయంలో ఆధ్యాత్మిక ప్రవచనకర్త రామకృష్ణానందకు, ప్రవచన వాచస్పతి, ప్రముఖ గేయ రచయిత దుర్గాప్రసాద్‌లకు జనకవి బిరుదులు ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య హాజరయ్యారు. ప్రముఖులు వెంకయ్య చౌదరి, నారాయణం శ్రీనివాస్, ఆర్‌వీఎస్ రమేష్, బీఎన్ మూర్తి, నాగభూషణరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పరిశీలనలో దసపల్లా భూములు

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. వైసీపీ హయాంలో పెట్టుబడులకు పెట్టేందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలను జగన్ వెళ్లగొట్టారని ఆరోపించారు. సింగపూర్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి.. అక్కడ పారిశ్రామికవేత్తలను కలిసి పెట్టుబడులను ఆహ్వానిస్తున్నారన్నారు. జగన్‌రెడ్డి హయాంలో నకిలీ మద్యం విక్రయించారని, మద్యం షాపుల్లో డిజిటల్ చెల్లింపులు లేకపోవడం వెనుక కుట్రకోణం ఉందన్నారు. వైసీపీ హయాంలో జరిగిన భూముల అక్రమ లావాదేవీలపై విచారణ చేస్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గండి బాబ్జీ, పొలమరశెట్టి శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ పాల్గొన్నారు.

గ్రేటర్‌లో చికెన్ వ్యర్థాల లొల్లి

... 5వ పేజీ తరువాయి

ఫిర్యాదు చేశారు. ఇలా రోజూ ఎక్కడో ఒకచోట చికెన్ వ్యర్థాల కోసం కొట్లాటలు, పోలీసు కేసులు నమోదవుతున్నాయి. తాజాగా అన్నవరం వైపు చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న ఐదు వాహనాలను అనకాపల్లి వద్ద కొందరు పట్టుకుని టీమ్ జీవీఎంసీ గ్రూపుతోపాటు ఇతర వాట్సాప్‌గ్రూపుల్లో పోస్ట్‌చేసి దీనివెనుక ఉన్నవారెవరో తేల్చాలంటూ వీడియోలు పెట్టడం చర్చనీయాంశంగా మారింది. ఇంత జరుగుతున్నా జీవీఎంసీ అధికారులు మాత్రం చికెన్ వ్యర్థాలను చేపల చెరువులకు తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు దారితీస్తోంది.

స్టాండింగ్ కమిటీపై టీడీపీ కసరత్తు

... 5వ పేజీ తరువాయి

నగరంలోని ఎమ్మెల్యేలకే వదిలిపెడుతున్నామని ప్రకటించేశారు. వారిచ్చే జాబితా ఆధారంగానే అభ్యర్థులు నామినేషన్లు దాఖలుచేస్తారని స్పష్టంచేశారు. దీంతో ఆశావహులంతా ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి అవకాశం ఇప్పించాలని ఒత్తిడిచేయడం ప్రారంభించారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల వరకే నామినేషన్ల దాఖలుకు అవకాశం ఉండడంతో ఆలోగా ఎమ్మెల్యేలు అభ్యర్థులను ఖరారుచేయాల్సి ఉంటుంది. జీవీఎంసీ పరిధిలో ఎనిమిది నియోజకవర్గాలు ఉండగా, ఒక్కో నియోజకవర్గం నుంచి ఒక్కో అభ్యర్థిని ఎంపికచేసినా ఒకరు ఎక్కువ అవుతారు కాబట్టి, పోటీకి దిగే అభ్యర్థుల ఎంపికపై కార్పొరేటర్లతోపాటు పార్టీనేతల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

సీనరేజ్ కాంట్రాక్ట్ కోసం పట్టు

... 5వ పేజీ తరువాయి

లేటరైట్ క్వారీలు ఉండగా, అల్లూరి జిల్లాలోని పాడేరు డివిజన్, విశాఖ జిల్లాలో తక్కువగా క్వారీలున్నాయి. అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, విశాఖ, పాడేరులో గనుల శాఖ ఏడీ కార్యాలయాలున్నాయి. ప్రభుత్వం నుంచి లైసెన్సులు తీసుకున్న క్వారీల నుంచి పూర్తిగా ఆదాయం రావడం లేదు. అనుమతి లేకుండా అనేక క్వారీల నుంచి వందల లారీల రాళ్లు, గ్రావెల్ తరలిపోతోంది. గ్రావెల్ మాఫియా ప్రతి నెలా రూ.కోట్ల విలువైన మట్టి, గ్రావెల్‌ను అనధికారికంగా తవ్వి, తరలిస్తోంది. అనకాపల్లి జిల్లాలో మెటల్ క్వారీల నుంచి ప్రతి రోజూ వందల లారీలతో బండరాళ్లను రాంబిల్లి వద్ద నేవల్ బేస్ నిర్మాణాల కోసం తరలిస్తున్నారు. వీరెవరూ ప్రభుత్వానికి పైసా చెల్లించడం లేదు. కాగా నాతవరం మండలం సరుగుడు, సుందరకోట పంచాయతీల పరిధిలో లేటరైట్ తవ్వకాలకు సంబంధించి ఇప్పటివరకు పక్కాగా లెక్కలు లేవు. కాంట్రాక్టరు చెప్పింది రాసుకోడం తప్ప గనులశాఖ పట్టించుకోవడం లేదు. లేటరైట్ తవ్వకాల నుంచి ప్రభుత్వానికి ఆదాయం రావడం లేదు. ఈ నేపథ్యంలో సీనరేజ్ వసూళ్ల కాంట్రాక్టును ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని గనుల శాఖ అధికారులు భావిస్తున్నారు.

కాంట్రాక్టు సంస్థల పోటీ

ఉమ్మడి జిల్లాలో గనుల శాఖకు ఇప్పటివరకు నెలకు రూ.11 కోట్లు ఆదాయం వస్తోంది. వసూళ్ల బాధ్యత ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే నేపథ్యంలో ఆదాయం పెరుగుతుందని భావించిన అధికారులు రూ.16 కోట్లకు టెండర్లు ఖరారుచేశారు. పోటీ ఉన్నందున కాంట్రాక్టు రూ.20 కోట్లకు చేరుతుందని, దీనివల్ల నెలకు రూ.9 కోట్ల చొప్పున ఏడాదికి సుమారు రూ.102 కోట్ల అదనపు ఆదాయం లభిస్తుందని అంచనా. దీంతోపాటు అనధికార క్వారీయింగ్, దొంగతనంగా లారీల్లో గ్రావెల్, రాళ్లు, గ్రానైట్, లేటరైట్ తరలింపునకు చెక్‌పడుతుందని భావిస్తున్నారు.

సంపాదన సాఫల్య కేంద్రాలు!

... 5వ పేజీ తరువాయి

జంటలను తీసుకురావడం వారి బాధ్యత. ఇందుకోసం వారికి భారీ మొత్తంలో చెల్లిస్తుంటారు. జిల్లాలో ప్రస్తుతం 50 సంతాన సాఫల్య కేంద్రాలున్నాయి. వీటిలో తొమ్మిది కేంద్రాలకు సరోగసీ నిర్వహించేందుకు అనుమతి ఉంది. అయితే, ఈ కేంద్రాల పేరుతో కొన్నిచోట్ల అడ్డగోలు వ్యవహారాలు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. ఒకసారి సంతాన సాఫల్య కేంద్రానికి వెళితే జేబులు ఖాళీ అవుతాయని చెబుతారు. పరీక్షల పేరుతో ప్రారంభంలోనే సుమారు రూ.50 వేల వరకు వసూలు చేస్తారని, ఐవీఎఫ్, ఇతర విధానాలకు సిద్ధపడితే కనీసం రూ.3 లక్షల వరకు ఖర్చు చేయాల్సిందేనని చెబుతున్నారు. అది కూడా వంద శాతం సక్సెస్ రేటు ఉండదని, ఫెయిల్ అయితే మరోసారి ప్రయత్నించాల్సిందేనంటున్నారు. దీనికి మళ్లీ డబ్బులు చెల్లించాల్సిందేనని వాపోతున్నారు. చికిత్స జరిగినంత కాలం ప్రక్రియకు సంబంధించిన రిపోర్టులు, ఇతర వివరాలను బయటకు ఇవ్వరు. కొంతకాలం తరువాత సదరు మహిళ కూడా అదే కేంద్రంలో ఉండాల్సి ఉంటుందంటున్నారు.

నిరుపేదలే లక్ష్యం..

కొన్ని సంతాన సాఫల్య కేంద్రాల నిర్వాహకులు వీర్య కణాల దానం పేరుతో పెద్దఎత్తున వ్యాపారం సాగిస్తున్నట్టు చెబుతున్నారు. తాజాగా సృష్టి కేసు విచారిస్తున్న పోలీసులు దిమ్మతిరిగే విషయాలను గుర్తించారు. అనేకమంది నుంచి సేకరించిన స్పెర్మ్‌ను చూసి అవాక్కయ్యారు. అనేక ఫెర్టిలిటీ సెంటర్ల నిర్వాహకులు ఇదే తరహాలో భారీగా స్పెర్మ్ కలెక్ట్ చేస్తున్నట్టు చెబుతున్నారు. నగరంలోని చాలా కేంద్రాల్లో ఇది యథేచ్ఛగా సాగుతోందంటున్నారు. స్పెర్మ్ దానం చేసేందుకు వచ్చే యువతకు భారీ మొత్తంలో చెల్లిస్తుంటారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న యువతను ఏజెంట్లు బుక్ చేసుకుంటారు. ఈ విషయాన్ని బయటకు రానీయకుండా జాగ్రత్త పడుతుంటారు. అయితే, ఇలా సేకరించిన స్పెర్మ్‌ను కొన్నిసార్లు సంతానం కోసం వచ్చే జంటలకు తెలియకుండా, వారి అనుమతి లేకుండా గర్భధారణ కోసం వినియోగిస్తుంటారనే ఆరోపణలున్నాయి. ఇదే ఇప్పుడు సృష్టి సెంటర్ కేసుకు కారణమైంది. ఇటు వంటి వ్యవహారాలే నగరంలో అనేక చోట్ల జరుగుతున్నట్టు చెబుతున్నారు. కొన్నిచోట్ల అనధికారికంగా సరోగసీ చేస్తు న్నారన్న విమర్శలున్నాయి. ఈ ప్రక్రియలో కొంతమంది అమాయక, ఆర్థిక అవసరాలు ఉన్న మహిళలను బలి పశువులు చేస్తున్నారని చెబుతున్నారు. ఆర్థిక అవసరాల కోసం పలువురు మహిళలు అద్దెకు గర్భాలు ఇస్తున్నారని, ఈ క్రమంలో కొంతమంది ప్రాణాలను కోల్పోతుంటే, ఇంకొందరు శారీరకంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటున్నారు. ఈ తరహా అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడిన కేంద్రాలపై గతంలోనూ ఆరోపణలు రావడంతో అధికారులు విచారణ చేపట్టారు. తాజాగా సృష్టి ఉదంతం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఆరోగ్యశాఖ అధికారులు సంతాన సాఫల్య కేంద్రాలను తనిఖీ చేయాలంటున్నారు. ఈ వ్యవహారాలపై ఇప్పటికే దృష్టి సారించామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు పేర్కొన్నారు. ఫెర్టిలిటీ సెంటర్లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, లేకపోతే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. తాజా వ్యవహారం నేపథ్యంలో ఫెర్టిలిటీ సెంటర్లలో తనిఖీలు చేస్తామన్నారు.

ఎట్టకేలకు స్థలం కేటాయింపు

» పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను భద్రపరిచేందుకు డాక్‌యార్డు కాలనీ సమీపంలో 3 ఎకరాలను కేటాయించిన రెవెన్యూ శాఖ

» జోన్-2 పరిధిలోని పోలీస్ స్టేషన్ల ఆవరణలో ఉన్న వాహనాలన్నీ త్వరలో అక్కడకు తరలింపు



గాజువాక పోలీస్ స్టేషన్ ఆవరణలో నిరుపయోగంగా పడివున్న వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలు

గాజువాక, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి పోలీస్ స్టేషన్ల కాంప్లెక్స్ ఆవరణలో ఏళ్లతరబడి వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను డంప్ చేసేందుకు ప్రత్యేకంగా స్థలం కేటాయించడంతో వీటికి మోక్షం కలగనున్నది. ఈ వాహనాలను డంప్ చేసేందుకు గాను గాజువాక మండల పరిధిలోని డాక్‌యార్డు కాలనీకి సమీపంలో సుమారు మూడెకరాల ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ శాఖ కేటాయించింది. దీంతో ఎంతోకాలంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉండిపోయిన వాహనాలను అక్కడకు తరలించనున్నారు. నగర పోలీస్ కమిషనరేట్‌లోని జోన్-2 పరిధిలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లకు సంబంధించి ఇకపై పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ యార్డులోనే భద్రపరచనున్నారు. కాగా సుమారు అన్ని పోలీస్ స్టేషన్లలో గత 20 ఏళ్ల నుంచి పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను వేరే చోట భద్రపరిచే అవకాశం లేక స్టేషన్ల ఆవరణలోనే ఉంచుతున్నారు. దీంతో ఆయా స్టేషన్ల ప్రాంగణాలు డంపింగ్ యార్డు మాదిరిగా దర్శనమిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో కోర్టు అనుమతితో వేలం వేసి పలు వాహనాలను విక్రయించారు. మరికొన్ని వాహనాలను సంబంధిత యజమానులకు అప్పగించడం జరిగింది. అయినప్పటికీ అనేక వాహనాలతో స్టేషన్ల ప్రాంగణాలు నిండిపోతున్నాయి. ఈ విషయం సీపీ దృష్టికి వెళ్లడంతో ఆయా వాహనాలను భద్రపరిచేందుకు స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరడంతో డాక్‌యార్డు కాలనీకి సమీపంలో సుమారు మూడు ఏకరాల స్థలాన్ని కేటాయించారు. సదరు స్థలాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నాక చుట్టూ ప్రహరీ నిర్మించనున్నారు. ఆ తరువాత ఇక్కడ వాహనాలను భద్రపరుస్తారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



కరపత్రాలను పంపిణీ చేస్తున్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు

పెదగంట్యాడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 76వ వార్డులోని డంపింగ్ యార్డు నుంచి బీసీ రోడ్డు వరకు గల గెడ్డను రూ.మూడు కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసేందుకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రామచంద్రానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏటా వర్షాకాలంలో ఈ గెడ్డ పొంగుతుండడంతో సమీపంలోని పలు కాలనీలు ముంపు బారిన పడుతున్నాయి, ఈ సమస్యను పరిష్కరించేందుకు గెడ్డకు ఇరువైపులా ఎత్తయిన రాతి గట్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న వాయు కాలుష్యాన్ని నివారించేందుకు క్లోజ్డ్ డంపింగ్ యార్డును నిర్మించేందుకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ముందుకు వచ్చారన్నారు.

అనంతరం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పల్లా ప్రారంభించారు. రామచంద్రానగర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్,నాయకులు జిత్తుక రాజు, కూన వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టులో బనారస్, నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌లు సహా పలు రైళ్లు రద్దు

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సంబల్‌పూర్ స్టేషన్‌లో నాన్ ఇంటర్ లాకింగ్, యార్డు ఆధునికీకరణ జరగనున్న నేపథ్యంలో బనారస్, నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌లు సహా పలు రైళ్లను రద్దు చేస్తూ, మరికొన్నింటిని మళ్లింపు మార్గంలో నడిపించనున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

రద్దయిన రైళ్లు: ఆగస్టు 10, 13 తేదీల్లో విశాఖ-బనారస్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ (18523), ఆగస్టు 11, 14 తేదీల్లో తిరుగు ప్రయాణంలో బనారస్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18524), ఆగస్టు 8, 10, 11, 15 తేదీల్లో సంబల్‌పూర్-నాందేడ్ ఎక్స్‌ప్రెస్ (20809),ఆగస్టు 9,11,12,16 తేదీల్లో తిరుగు ప్రయాణంలో నాందేడ్-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (20810), ఆగస్టు 7 నుంచి 16 వరకు సంబల్‌పూర్-రాయగడ ఎక్స్‌ప్రెస్ (18301), రాయగడ-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (18302)లు రద్దు జాబితాలో ఉన్నాయన్నారు.

దారి మళ్లింపు: టాటా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189) ఆగస్టు 8 నుంచి 14 వరకు విజయనగరం మీదుగా ఝార్సుగూడ రోడ్డు, సంబల్‌పూర్ సిటీ, నారజ్ నార్తాపూర్, అనుగుల్, ఖుర్దారోడ్డు, తిరుగు ప్రయాణంలో ఎర్నాకులం-టాటా ఎక్స్‌ప్రెస్ (18190) ఆగస్టు 7 నుంచి 13 వరకు విజయనగరం, ఖుర్దారోడ్డు, అనుగుల్, నారజ్ నార్తాపూర్, సంబల్‌పూర్ సిటీ, ఝార్సుగూడ రోడ్డు మీదుగా నడుస్తాయి. అలాగే తంబరం-జసిదిహ్ ఎక్స్‌ప్రెస్ (12375) ఆగస్టు 9న విజయనగరం, ఖుర్దారోడ్డు, అనుగుల్, నారజ్ నార్తాపూర్, సంబల్‌పూర్ సిటీ, ఝార్సుగూడ రోడ్డు మీదుగా, తిరుగు ప్రయాణంలో జసిదిహ్-తంబరం ఎక్స్‌ప్రెస్ (12376) ఆగస్టు 13న ఝార్సుగూడ రోడ్డు, సంబల్‌పూర్ సిటీ, నారజ్ నార్తాపూర్, అనుగుల్, ఖుర్దారోడ్డు, విజయనగరం మీదుగా నడుస్తాయి. ఎస్ఎంవీటీ బెంగళూరు-టాటానగర్ ఎక్స్‌ప్రెస్ (12889) ఆగస్టు 8న ఝార్సుగూడ రోడ్డు, సంబల్‌పూర్ సిటీ, నారజ్ నార్తాపూర్, అనుగుల్, ఖుర్దారోడ్డు, విజయనగరం మీదుగా, తిరుగు ప్రయాణంలో టాటానగర్-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12890) ఆగస్టు 11న విజయనగరం, ఖుర్దారోడ్డు, అనుగుల్, నారజ్ నార్తాపూర్, సంబల్‌పూర్ సిటీ, ఝార్సుగూడ రోడ్డు మీదుగా నడుస్తాయి. బెంగళూరు-హటియా ఎక్స్‌ప్రెస్ (12836) ఆగస్టు 12న విజయనగరం, ఖుర్దారోడ్డు, అనుగుల్, నారజ్ నార్తాపూర్, సంబల్‌పూర్ సిటీ, ఝార్సుగూడ రోడ్డు మీదుగా నడుస్తుందని డీసీఎం పేర్కొన్నారు.



దుర్గానగర్ నుంచి బీసీ రోడ్డుకు వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన ఐరన్ గడ్డర్. (ఇన్‌సెట్లో) కృష్ణారావు

రోడ్డుపై ఏర్పాటు చేసిన ఐరన్ గడ్డర్‌ను తొలగించాలి

వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్ వీవీ కృష్ణారావు

కూర్మన్నపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రహదారిపై ఐరన్ గడ్డర్లను ఏర్పాటు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం వల్ల స్టీల్ ప్లాంట్ యాజమాన్యానికి ప్రయోజనం ఏమీ ఉండదని వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్ వీవీ కృష్ణారావు అన్నారు. 88వ వార్డు గ్రీన్ సిటీలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పారిశ్రామిక ప్రాంత ప్రజలు వినియోగిస్తున్న రహదారులను మూసివేయడం అనాలోచిత నిర్ణయమన్నారు.

ప్రజలను ఇబ్బందులకు గురి చేసే ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన సున్నితంగా హెచ్చరించారు. కణితి రోడ్డు దుర్గానగర్ నుంచి బీసీ రోడ్డుకు వెళ్లే రహదారిలో ఉక్కు యాజమాన్యం భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా ఐరన్ గడ్డర్‌ను ఏర్పాటు చేయడం దారుణమన్నారు. దీనివల్ల వైజాగ్ ప్రొఫైల్స్‌కు సంబందించిన వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. తమ సంస్థతో స్టీల్ ప్లాంట్‌కు మంచి సంబంధాలు ఉన్నందునే కోట్లాది రూపాయల వ్యాపారం చేస్తూ వందలాది మందికి ఉపాధి కల్పిస్తున్నామని పేర్కొన్నారు. స్టీల్ ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడంలో తమ సంస్థ ఎంతో కృషి చేసిందని, అయినా కూడా తమ కంపెనీతో పాటు పలు యూనిట్ల ప్రతినిధులకు ఇబ్బం దులు పెట్టేలా చేస్తుండడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ఉక్కు యాజమాన్యం రహదారిపై ఏర్పాటు చేసిన ఐరన్ గడ్డర్‌ను తొలగించాలని కృష్ణారావు డిమాండ్ చేశారు., లేకుంటే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ఎమ్మెల్యే పంచకర్లకు సత్కారం



పంచకర్లకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

పెందుర్తి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉభయసభల మౌలిక సదుపాయల కమిటీ సభ్యుడిగా నియమితులైన ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును ఆదివారం సుజాత నగర్‌లో పలువురు కూటమి నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ మౌలిక సదుపాయల కమిటీ సభ్యుడిగా మరింత బాధ్యతతో పనిచేస్తానని పేర్కొన్నారు.

22 కిలోల గంజాయి స్వాధీనం

ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు మహిళల అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయి, పట్టుబడిన మహిళలతో పోలీసులు

గోపాలపట్నం, జూలై 27(ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ఇద్దరు మహిళలను గోపాలపట్నం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలా ప్రకారం.. నార్త్ సింహాచలం రైల్వే క్వార్టర్స్ సమీపంలో గంజాయి రవాణా జరుగుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఆదివారం మధ్యాహ్నం ఎస్ఐ అప్పలనాయుడు బృందం రైల్వే క్వార్టర్స్ సమీపంలో తనిఖీలు చేస్తుండగా ఒడిశా రాష్ట్రానికి చెందిన రాధికా సేతి, మృత్యాలమ్మ హండా అనే ఇద్దరు మహిళల వద్ద గల బ్యాగుల్లో 22 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆ మహిళలను అదుపులోకి తీసుకున్నారు. సీఐ ఎన్వీ ప్రభాకర్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి ఇద్దరు మహిళలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సామాజిక భద్రతా పథకాలపై అవగాహన సదస్సు



పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆటోనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): లఘు ఉద్యోగ భారతి (ఎల్‌యూబి) విశాఖపట్నం, ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) విశాఖపట్నం ఆధ్వర్యంలో ఆటోనగర్‌లో ఆదివారం పారిశ్రామికవేత్తలకు సామాజిక భద్రతా పథకాలు స్ప్రీ-2025పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌కే సాహు, అసిస్టెంట్ డైరెక్టర్ వి.శ్యామ్‌ప్రసాద్‌లు సురక్షితమైన బలమైన వ్యాపారం ఎలా ఉండాలో వివరించారు. పరిశ్రమల సమస్యలను పాలసీల ద్వారా పరిష్కరిస్తామన్నారు. ఎల్‌యూబీ అధ్యక్షుడు జగపతిరాజు, నేషనల్ వర్కింగ్ కమిటీ సభ్యుడు ఏకే బాలాజీ మాట్లాడుతూ నూతన టెక్నాలజీ, పథకాలను పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలన్నారు. ఎన్‌డబ్ల్యూసీ రాష్ట్ర కార్యదర్శి అట్లూరి రమేశ్ మాట్లాడుతూ చిన్న, మధ్యతరహా పరిశ్రమల పారిశ్రామికవేత్తల సమస్యల పరిష్కారానికి కేంద్రం ప్రత్యేక పాలసీని అమలులోకి తెచ్చిందని ఆ పాలసీ విధి విధానాలను వివరించారు. పలువురి పారిశ్రామికవేత్తల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎన్‌డబ్ల్యూసీ జిల్లా కార్యదర్శి పవన్ జైస్వాల్, ఎస్.సత్య, నాగిరెడ్డి, పెద్దసంఖ్యలో పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి: ఐదుగురిపై హత్యాయత్నం కేసు



గాయపడిన సంతోశ్‌కుమార్

ఉక్కుటౌన్‌షిప్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై దాడి చేసిన సంఘటనకు సంబంధించి ఐదుగురిపై స్టీల్ ప్లాంట్ పోలీసులు హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. వివరా లిలా ఉన్నాయి. దేశపాత్రునిపాలెం ప్రాంతానికి చెందిన మొల్లి సంతోశ్‌కుమార్ ఈ నెల 25న పెదగంట్యాడలో చదువుతున్న తమ కుమార్తెను పాఠశాల నుంచి ఇంటికి తీసుకువచ్చేందుకు వెళ్లగా, స్కూల్ సాయంత్రం ఏడు గంటల వరకు ఉంటుందని, అందువల్ల తరువాత రావాలని సిబ్బంది తెలిపారు. దీంతో సంతోశ్‌కుమార్ సమీపంలోని లారీ యార్డులో ఉన్న స్నేహితులు సతీశ్, గణేశ్‌ల వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న పెదగంట్యాడకు చెందిన మొల్లి శివ, మొల్లి శ్రీను, వాసు, రవి, ప్రవీణ్‌లు సంతోశ్‌కుమార్‌పై కర్రతో దాడి చేశారు. అక్కడ నుంచి తప్పించుకున్న సంతోశ్‌కుమార్ స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రికి, అక్కడ నుంచి అగనంపూడి ఏరియా ఆస్పత్రికి చేరుకుని చికిత్స పొందాడు. తనపై దాడి చేసిన వారిపై స్టీల్ ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేశారు. దాడికి పాల్పడిన ఐదుగురూ పరారీలో ఉన్నారని, వారి కోసం మూడు బృందాలు గాలిస్తున్నాయని పోలీసులు పేర్కొన్నారు.

ఉక్కు ఆస్పత్రిలో వైద్య సేవలను మెరుగుపరచాలి

ఉక్కుటౌన్‌షిప్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ జనరల్ ఆస్పత్రిలో వైద్య సేవలను మరింత మెరుగుపర్చాలని ఉక్కు కార్మిక సంఘ నాయకులు కోరుతున్నారు. ఇటీవల చాలామంది ఉద్యోగులు వీఆర్ఎస్, పదవీ విరమణ చేయడంతో చాలావరకు వైద్య సేవలు తగ్గిపోయాయని వారు పేర్కొన్నారు. వైద్యులను నియమించి, పూర్తి స్థాయిలో వైద్య సేవలందించడంతో పాటు మందులను అందుబాటులో ఉంచాలన్నారు. అదేవిధంగా పెదగంట్యాడ ఆస్పత్రిని గతంలో మాదిరిగా నడపాలని విజ్ఞప్తి చేశారు.



పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేస్తున్న సీఐ పార్థసారథి, తదితరులు

ఉన్నత చదువులతోనే గుర్తింపు: సీఐ పార్థసారథి

పెదగంట్యాడ, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులతో మంచి భవిష్యత్తుతో పాటు సమాజం ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని గాజువాక సీఐ పార్థసారథి అన్నారు. 65వ వార్డు కాకతీయ గేట్ వద్ద ఆదివారం రూస్సీ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లను సీఐ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యావంతుల సంఖ్య పెరిగినప్పుడే సమాజం త్వరగా అభివృద్ధి చెందుతుందన్నారు. ట్రస్టు వ్యవస్థాపకుడు వానపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటివరకు సుమారు 9,500మంది విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లను అందజేశామన్నారు. కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, బొడ్డు నరసింహపాత్రుడు, గరుడాద్రి శ్రీవేంకటేశ్వరాలయ చైర్మన్ దొడ్డి రమణ, టీడీపీ నాయకుడు పప్పు రాజారావు, సింహగిరి చారిటబుల్ ట్రస్టు డైరెక్టర్ డాక్టర్ కేవీఎస్ కల్యాణ్, న్యాయవాది పి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి శంకుస్థాపన

గోపాలపట్నం,జూలై 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 89వ వార్డు పరిధి కొత్తపాలెం గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించనున్న సామాజిక భవన నిర్మాణ పనులకు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టి, పూర్తి స్థాయిలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ పీఏసీఎస్ చైర్మన్ బొడ్డేటి విజయ్‌కుమార్, గౌరీ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆలయానికి వితరణ

వేపగుంట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లిలోని శ్రీవేదమాత గాయత్రీదేవి ఆలయానికి న్యాయవాది, వాండ్రంగి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు విశ్వేశ్వరరావు రూ.25 వేల విలువ చేసే పంపు సెట్‌ను ఆలయ చైర్మన్ కె.రామకృష్ణశర్మకు అందజేశారు. ఈ పంప్ సెట్ ద్వారా రోజూ గాయత్రీ మాతకు జలాభిషేకం చేయవచ్చని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వి.సుధారాణి, సిరివైష్ణవి, దివ్యాంశి, శివమణి, శ్రీనివాస్ పట్నాయక్, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ



పెదగంట్యాడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నక్క వెంకటరమణను నియమిస్తూ రాష్ట్ర కార్యాలయం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. స్టీల్ ప్లాంట్ కార్మికుడిగా కార్మిక రంగానికి వెంకటరమణ అంది స్తున్న సేవలను గుర్తించి పార్టీ రాష్ట్రకార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. తనకు ఈ పదవి వచ్చేందుకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సినిమా గైడ్

- **హరిహర వీరమల్లు** : జగదాంబ, శారద, రమాదేవి, మెలోడి, వెంకటేశ్వర, శ్రీ వెంకటేశ్వర, లీలామహల్, సంగం, శ్రీరామా, కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, శ్రీకన్య హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **జూనియర్** : శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),
- **తమ్ముడు** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 40,వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 34, పచ్చిమిర్చి 72, కాకరకాయలు 26, బీరకాయలు 32, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 24, క్యారెట్ 44, దొండకాయలు 26, బంగాళదుంపలు 16, అరటికాయ(పె) 10, మునక్కాడలు(కిలో) 42, అల్లం (పాతది) 66, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్ధచిక్కుడు 50, దోస కాయలు 14, వెల్లుల్లి(పెద్దవి) 80, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 80, కీరదోస 30, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద42, , గోరుచిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిదగుమ్మడికాయ 20, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పి.గణబాబు

ఉత్తరాంధ్ర అభివృద్ధికి చంద్రబాబు అధిక ప్రాధాన్యం: ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధితో పాటు సీఎం చంద్రబాబునాయుడు ఈ ప్రాంతానికి ఎంతో రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తుండడం ఎంతో ఆనందంగా ఉందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు కృతజ్ఞతలు తెలిపారు. తమ నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమాశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల గోవా గవర్నర్‌గా పి.అశోక్‌గజపతిరాజును నియమించడంలో రాజకీయ నిర్ణయాల్లో కూడా ఈ ప్రాంతానికి అన్ని విధాల చంద్రబాబు ప్రాధాన్యం కల్పిస్తున్నారన్నారు. విశాఖకు రైల్వే జోన్ కేటాయింపు, ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీతో పాటు ఐటీ హబ్‌గా విశాఖను తీర్చిదిద్దడానికి పలు సంస్థలతో చేసుకున్న ఒప్పందాలతో ఉత్తరాంధ్ర ప్రగతికి బాటలు వేస్తున్నారన్నారు.

ఇటీవల ప్రపంచ యోగా డే వేడుకలను విశాఖ వేదికగా విజయవంతం చేసి ప్రపంచానికి విశాఖ ఖ్యాతిని తెలియజేశారని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కేంద్రాన్ని ఒప్పించి రూ.11 వేల కోట్ల నిధులను మంజూరు చేయించారన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. విశాఖలో భూగర్భ విద్యుత్ లైన్ల ఏర్పాటుతో పాటు మెట్రో కారిడార్‌పై ప్రణాళికను రూపొందించి విశాఖ అభివృద్ధిని వేగవంతం చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు దాడి వెంకటరమేశ్, బొమ్మిడి రమణ, స్థానిక నాయకులు ఎలమంచిలి ప్రసాద్, ఎస్.సత్తిరాజు, అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి: వేగి పరమేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న వేగి పరమేశ్వరరావు

పెందుర్తి: గత వైసీపీ ప్రభుత్వ హయాంతో ఉత్తరాంధ్రకు తీవ్ర నష్టం వాటిల్లిందని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టాక ఉత్తరాంధ్ర దేశానికి గ్రోత్ మోడల్‌గా మారనున్నదని రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వరరావు అన్నారు. పెందుర్తిలోని వేగివారి నివాసంలో ఆదివారం ఉత్తరాంధ్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ల ముఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గోవా గవర్నర్‌గా పి.అశోక్‌గజపతిరాజును నియమించినందుకు కృషి చేసిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడుతో పాటు పలువురు ఉత్తరాంధ్ర నేతలకు చంద్రబాబు అత్యున్నత్న గౌరవం కల్పించారన్నారు. భోగాపురం విమానాశ్రయం 2026 నాటికి పూర్తి కానున్నదని, మెట్రో ప్రాజెక్ట్ మళ్లీ పట్టాలెక్కనున్నదని, మెడ్‌టెక్ జోన్ మరింత అభివృద్ధికి ప్రణాళికను రూపొందించారన్నారు. సమావేశంలో ఎస్.కోట, నర్సీపట్నం, అనకాపల్లి, ఎలమంచిలి, విశాఖ ప్రాంతాలకు చెందిన గవర కార్పొరేషన్ డైరెక్టర్లు మళ్ల రామకృష్ణ, ఆళ్ల మంగరాజు, బొడ్డేటి శ్రీనివాస్ , భీమరశెట్టి శ్రీనివాస్, విల్లూరి హరికృష్ణ, మళ్ల రవి, తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత అబ్దుల్ కలామ్: సీఐ శ్రీనివాసరావు



కలామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సీఐ

ఆటోనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ రాష్ట్రపతి, దివంగత డాక్టర్ అబ్దుల్ కలామ్ ఆశయాలను విద్యార్థులందరూ స్ఫూర్తిగా తీసుకుని ఆచరణలో పెట్టాలని క్రైమ్ సీఐ కె.శ్రీనివాసరావు అన్నారు. 70వ వార్డు పరిధిలోని ట్వింకిల్ స్కూల్ ఆవరణలో చైర్మన్ దొడ్డి శ్యామ్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలామ్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. తొలుత కలామ్ విగ్రహానికి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలామ్ పిలుపు మేరకు వందలాది మంది విద్యార్థులకు ఉచిత విద్యను స్కూల్ యాజమాన్యం అందిస్తుండడం అభినందనీయమన్నారు. చైర్మన్ దొడ్డి శ్యామ్ మాట్లాడుతూ అబ్దుల్ కలామ్ ఆశయ సాధనే ధ్యేయంగా స్ఫూర్తిదాయక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కరుణకుమారి, ఉపాధ్యాయులు ఎం.గీత, శిరీష, గౌరి, లలిత, సంధ్య, పుణ్యవతి,పద్మావతి, కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తాం: 'పల్లా'

పెదగంట్యాడ, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఉక్కు నిర్వాసిత కాలనీల్లోని క్రీడా మైదానాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 75వ వార్డు నెల్లిముక్కు క్రీడా మైదానంలో ఎస్‌పీఎం క్రికెట్ ప్రీమియర్ లీగ్-4 టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు.కార్యక్రమంలో కూటమి నాయకులు మొల్లి పెంటిరాజు, కోన చినఅప్పారావు, నమ్మి అప్పారావు, ఎం.పెంటయ్య, ఉరుకూటి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికను వినియోగించుకుంటే అభివృద్ధి

అక్కిరెడ్డిపాలెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ఖాతాదారులకు నాణ్యమైన ఉత్తమ సేవలందించే ఏ సంస్థ అయినా అభివృద్ధి చెందుతుందని వాసీవా అధ్యక్షుడు ఎస్.పాండురంగప్రసాద్ అన్నారు. షీలానగర్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగిన బీఎస్ఐ నెట్‌వర్క్ జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. ఏ రంగంలోనైనా గత తప్పిదాలు పునరావృతం కాకుండా చూసుకుంటూ సాంకేతిక పరిజ్ఞానంతో సరికొత్త పరిచయాలను పెంచుకుంటూ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని కోరారు.

బీఎస్ఐ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేవీటీ రమేశ్ మాట్లాడుతూ తమ వ్యాపారాభివృద్ధికి కావాల్సిన బలమైన నెట్ వర్కింగ్‌కు బీఎస్ఐ వేదిక అవుతాదన్నారు. సదస్సులో వాసీవా మాజీ అధ్యక్షుడు ఏకే బాలాజీ, చెరకు కిరణ్, వి.ఉదయ్, హర్షవర్ధన్, బాలగంగాధర్, జీఎస్ఎన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలకు ఆదర్శంగా ఉండాలి

జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి భాగ్యలక్ష్మి

మల్కాపురం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు పిల్లలకు ఆదర్శంగా ఉండాలని, సమాజ కట్టుబాట్లు, నీతి, నియమాల గురించి తెలియజేయాలని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం జరిగిన తల్లిదండ్రుల దినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నారుల బంగారు భవిష్యత్తుకు పునాది వేసేది తల్లిదండ్రులేనని అన్నారు. తల్లిదండ్రుల కమిటీ సభ్యుడు ఎం.సురేశ్ మాట్లాడుతూ ప్రతి చిన్నారి క్రమశిక్షణతో ఉండాలని, అపరిచితులకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'చేనేత పరిశ్రమకు గుర్తింపు తెచ్చిన కోటయ్య'

పెదగంట్యాడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చేనేత సంఘం అధ్యక్షుడిగా వ్యవహరించిన దివంగత ప్రగడ కోటయ్య చేనేత పరిశ్రమ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని రాష్ట్ర పద్మశాలి సంఘం కన్వీనర్ పప్పు రాజారావు పేర్కొన్నారు. పెదగంట్యాడ పద్మశాలి సంఘం భవన్‌లో ఆదివారం కోటయ్య 110వ జయంత్యుత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, రాజ్యసభ సభ్యునిగా కోటయ్య చేనేత పరిశ్రమకు ప్రత్యేక గుర్తింపు తెచ్చారన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు తెడ్లపు సతీశ్, సేనెట్టి అప్పారావు, నామాల వరహాలు, నామాల శ్రీకాంత్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.